Follow: @ANNTELUGU

10-11-2024

ANN తెలుగు

# మహా పత్రిక

ఆదివారం, హైదరాబాద్ | సంపుటి- 23 | సంచిక- 299 | పేజీలు-10 | వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI | REGISTERED NUMBER: APTEL/2003/9316 | WWW.EPAPER.MAHAADAILY.COM


## పిచ్చిమాటలొద్దు

**మీకు అధికారమిచ్చింది సేవ చేయడానికి..**

### కూల్చడానికి కాదు

**కాంగ్రెస్ సర్కార్ పై కేసీఆర్ ఫైర్**

**ఏం కోల్పోయారో.. ప్రజలకు అర్థమైంది**

**వచ్చే ఎన్నికల్లో వందశాతం మనమే గెలుస్తాం**

**ఎర్రవల్లిలో మాజీ సీఎం కేసీఆర్ సంచలన వ్యాఖ్యలు**

**గజ్వేల్, మహా:** కాంగ్రెస్ ప్రభుత్వం పదకొండు మాసాల్లో పూర్తిగా విఫలం అయ్యిందని కేసీఆర్ విమర్శించారు. రేవంత్ సర్కార్ పై అన్ని వర్గాల్లో అసంతృప్తి ఉందని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అన్నారు. మనం అందరం కలిసికట్టుగా పని చేస్తే వచ్చే ఎన్నికల్లో వందకు వంద శాతం ప్రభుత్వం మనదేనని ధీమా వ్యక్తం చేశారు.

మిగతా 3లో



---

ఈనెల 14 నుండి డిసెంబర్ 9వ తేదీ వరకు

## ప్రజా విజయోత్సవాలు

- గత పది నెలల్లో ఊహకందని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు
- ప్రజలు విస్తృతంగా పాల్గొనాలని పిలుపునిచ్చిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



03

---

టికెట్ రేట్లు పెంచుకోవడానికే

## సీఎం కావాలా?: బండ్ల ఫైర్

ఫిలిం ఇండస్ట్రీ ప్రముఖులకు వార్నింగ్ ఇచ్చారు నిర్మాత, కాంగ్రెస్ నేత బండ్ల గణేష్. సీఎం రేవంత్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలపని సినీ ప్రముఖులపై అసహనం వ్యక్తం చేశారు. టికెట్లు పెంచుకోవడానికి మాత్రమే రేవంత్ రెడ్డి కావాలి...కానీ పుట్టిన రోజు మాత్రం గుర్తుకు రాదా అంటూ సీరియస్ అయ్యారు. బండ్ల గణేష్ వ్యాఖ్యలు ఫిల్మ్ నగర్ లో హాట్ టాపిక్ గా మారాయి.




---

## మోడీజీ తెలంగాణలో కులగణన మొదలైంది

**రాహుల్ గాంధీ సంచలన ట్వీట్**

మోడీ జీ తెలంగాణలో కులగణన మొదలైంది. రాష్ట్రంలోని ప్రతి వర్గాల అభివృద్ధికి సంబంధించిన విధానాలను రూపొందించడానికి మేము ఈ డేటాను ఉపయోగిస్తాము. దేశంలో సమగ్ర కుల గణన చేపట్టడం బీజేపీకి ఇష్టం లేదు.. నేను మోడీ జీకి స్పష్టంగా చెప్పాలనుకుంటున్నాను.. దేశవ్యాప్తంగా కుల గణనను మీరు ఆపలేరు. ఈ పార్లమెంట్‌లోనే కుల గణనను ఆమోదించి.. రిజర్వేషన్లపై 50% గోడను బద్దలు కొడతాం"..అంటూ రాహుల్ ట్వీట్ చేశారు.



---



## మంత్రి శ్రీధర్ బాబు ఇంట్లో చోరీ

**మహా:** డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క్ ఇంట్లో ఇటీవల చోరీగా జరగ్గా.. ఇప్పుడు మళ్లీ మంత్రి శ్రీధర్ బాబు ఇంట్లో చోరీ జరిగింది. బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న మంత్రి ఇంట్లో దీపావళి రోజున మొబైల్ చోరీకి గురైంది. ఆ మొబైల్‌ను వెతికి పెట్టాలని మంత్రి శ్రీధర్ బాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దీపావళికి జరిగిన ఈ ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది.

---



## నన్ను ఎవరూ అంచనా వేయలేరు

**మహా:** రామ్‌చరణ్ 'గేమ్ ఛేంజర్' టీజర్ వచ్చేసింది భారీ బడ్జెట్‌తో రూపుదిద్దుకుంటోన్న రామ్‌చరణ్ 'గేమ్ ఛేంజర్ చిత్రం సంక్రాంతి కానుకగా జనవరి 10న రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలోనే చిత్రబృందం శనివారం గేమ్ ఛేంజర్ టీజర్ విడుదల చేసింది. ప్రభుత్వ అధికారి పాత్రలో రామ్‌చరణ్ నటన, పవర్‌ఫుల్ సంభాషణలు అదిరిపోయాయి. తమన్ అందించిన మ్యూజిక్ టీజర్‌ను మరింత ఎలివేట్ చేసింది. సినిమాలో రామ్ చరణ్ ద్విపాత్రాభినయంలో కనిపించనున్నట్లు తెలుస్తోంది.

---



# జై ఇందిరమ్మ

## బిజెపి ఎమ్మెల్యేల తాజా స్లోగన్

**ఇందిరమ్మ కమిటీల్లో చోటుకు లాబీయింగ్**

- బిజెపి ఎమ్మెల్యేలకు అనుకూలంగా పలువురు మంత్రులు
- భగ్గుమంటున్న కాంగ్రెస్ క్యాడర్
- ఇట్లయితే.. కాంగ్రెస్‌కు ఏం ఫాయిదా అంటూ క్యాడర్ గగ్గోలు
- రేపటి నుండి బిజెపి క్యాడర్ జై ఇందిరమ్మ అంటూ తిరుగుతారా అంటూ ఫైర్
- బోథ్ లో కొట్టుకున్న కాంగ్రెస్ బిఆర్ఎస్
- ఆదిలాబాద్‌లో కాంగ్రెస్ వర్సెస్ బిజెపి
- విపక్ష నియోజకవర్గాల్లో కీలక నేతల మెహర్బానీ

> బిజెపి అధిష్టానం రూటుమార్చిందా? లేక బిజెపి ఎమ్మెల్యేలు రూటు మార్చారో గానీ.. జై ఇందిరమ్మ అంటామంటూ లాబీయింగ్ చేస్తున్నారు. కాంగ్రెస్ మంత్రులకే కాదు.. పలుకుబడి ఉన్న నేతలందరికీ ఫోన్లు చేస్తూ పనుల కోసం కొందరు దేనికైనా రెడీ అంటున్నారు. వైఎస్ఆర్ తరహాలో ఇందిరమ్మ పథకాన్ని పేదలకు మేలు జరిగేలా, కాంగ్రెస్ కు పట్టుచిక్కేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూపొందించగా ఇందుకు భిన్నంగా కొన్ని జిల్లాల కలెక్టర్లు, కొందరు కీలక నేతలు విపక్ష ఎమ్మెల్యేలకు పెద్ద పీఠ వేస్తూ కాంగ్రెస్‌ను ఇబ్బంది పెట్టే ఎత్తుగడలకు దిగుతున్నారు.

**హైదరాబాద్, మహా:** బిజెపి అధిష్టానం రూటుమార్చిందా? లేక బిజెపి ఎమ్మెల్యేలు రూటు మార్చారో గానీ.. జై ఇందిరమ్మ అంటామంటూ లాబీయింగ్ చేస్తున్నారు. కాంగ్రెస్ మంత్రులకే కాదు.. పలుకుబడి ఉన్న నేతలందరికీ ఫోన్లు చేస్తూ పనుల కోసం కొందరు దేనికైనా రెడీ అంటున్నారు. వైఎస్ ఆర్ తరహాలో ఇందిరమ్మ పథకాన్ని పేదలకు మేలు జరిగేలా, కాంగ్రెస్ కు పట్టుచిక్కేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూపొందించగా ఇందుకు భిన్నంగా కొన్ని జిల్లాల కలెక్టర్లు, కొందరు కీలక నేతలు విపక్ష ఎమ్మెల్యేలకు పెద్ద పీఠ వేస్తూ కాంగ్రెస్ ను ఖతం చేసే ఎత్తుగడలకు దిగుతున్నారు. ఆ నియోజకవర్గం మాది కాదు కదా.. మనల్ని మంచి అంటే చాలంటూ పథకం లక్ష్యాన్ని, కాంగ్రెస్ ప్రయోజనాలను ఫణంగా పెడుతున్నారని కీలకనేతలపై అధిష్టానానికి నివేదికలు అందుతున్నాయి. బిజెపి ఎమ్మెల్యే ఉన్న ఓ నియోజకవర్గంలో జిల్లా కలెక్టర్ పూర్తిగా ఆయనకు అనుకూలంగా పనిచేస్తున్నారని ముఖ్యమంత్రికి ఫిర్యాదులు అందాయి. దీనికి తోడు ఇందిరమ్మ కమిటీల్లో ఒక్కో సభ్యుడిని విపక్షపార్టీకి కేటాయించడంతో పాటు ఆ గ్రామంలో మిగతా సభ్యులను ఎంపిక చేసే పెత్తనం అప్పగించడంతో ఇది కాంగ్రెస్ క్యాడర్ గొంతుకోసే కార్యక్రమమంటూ క్యాడర్ తీవ్రంగా మండిపడుతున్నారు. మా గ్రామంలో, ప్రభుత్వ కమిటీలలో బిజెపి పెత్తనం ఏంటంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇందిరమ్మ కమిటీలలో బిజెపి సభ్యులను, బిజెపి నేతలను చేరిస్తే వారు రేపటి నుండి జై ఇందిరమ్మ అంటారా.. ఇందిరమ్మ ఔన్నత్యం గురించి ప్రశంసిస్తారా అంటూ కాంగ్రెస్ క్యాడర్ నిలదీస్తున్నారు.

మిగతా 3లో

---

### బంగారం ధరలు

| | |
|---|---|
| 24 క్యారెట్ | 79,360 |
| 22 క్యారెట్ | 72,750 |
| సిల్వర్ (కేజీ) | 94,000 |

### స్టాక్ మార్కెట్

| | |
|---|---|
| సెన్సెక్స్ ↗ | 79,486.32 |
| నిఫ్టీ ↗ | 24,148.20 |

### ఈరోజు చికెన్ ధరలు

1 కేజీ రిటైల్ ధర ₹

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 160 | 200 | 210 |

హోల్ సేల్ ధర ₹

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 160 | 200 | 210 |

### ఈరోజు గుడ్డు ధరలు

| | 1 పీస్ | ట్రే |
|---|---|---|
| ఎన్ఈసీసీ గుడ్డు ధర | 5.55 | 166.5 |
| హోల్ సేల్ గుడ్డు ధర | 5.55 | 166.5 |
| రిటైల్ గుడ్డు ధర | 5.88 | 176.49 |

---

# ఇదేమైనా పాకిస్తానా..?

**బుల్డోజర్లతో తొక్కిస్తామనడం ఏమిటి?.. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు**

**వడ్ల కొనుగోలు తీరును రాహుల్ పరిశీలించాలి**

**నల్గొండ, మహా :** బుల్డోజర్లతో తొక్కించడానికి ఇదేమైనా పాకిస్తానా..? అంటూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. యాదగిరిగుట్టభువనగిరి జిల్లాలోని పోచంపల్లి గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు కిషన్ రెడ్డి. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి దిగజారి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మూసీ ప్రక్షాళనకు బీజేపీ వ్యతిరేకం కాదని, పేదల ఇళ్ల కూల్చివేతలను మాత్రమే వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు.

వివరాలు 2లో



---

సికింద్రాబాద్-శాలీమార్ ఎక్స్‌ప్రెస్

# రైలుకు ప్రమాదం

**పట్టాలు తప్పిన ట్రైన్.. తప్పిన పెనుముప్పు**

**పశ్చిమ బెంగాల్‌లో ట్రైన్ యాక్సిడెంట్**



**హైదరాబాద్, మహా :** సికింద్రాబాద్‌శాలీమార్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌కు పెను ప్రమాదం తప్పింది. ఈ ట్రైన్‌కు చెందిన మూడు బోగీలు పట్టాలు తప్పాయి. పశ్చిమ బెంగాల్‌లోని నల్పూర్ స్టేషన్ సమీపంలో శనివారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. అయితే ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని.. సౌత్‌ఈస్ట్రన్ రైల్వే అధికారులు వెల్లడించారు. పట్టాలు తప్పిన వాటిల్లో రెండు ప్రయాణికుల బోగీలు కాగా.. మరో పార్సిల్ వ్యాన్ అని అధికారులు వెల్లడించారు. ఈ ప్రమాదంపై సౌత్ ఈస్టర్న్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఓం ప్రకాష్ చరణ్ స్పందించారు. పశ్చిమ బెంగాల్‌లోని నల్పూర్ స్టేషన్ సమీపంలో ఇవాళ ఉదయం 5:31 గంటల సమయంలో సికింద్రాబాద్‌శాలీమార్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పినట్లు తెలిపారు.

వివరాలు 2లో

---

# దళిత బంధు కోసం ధర్నా

**అస్వస్థతకు గురైన ఎమ్మెల్యే పాడి కౌశిక్**

**ఆసుపత్రిలో చేరిక.. పోలీసులదే బాధ్యత అన్న హరీష్ రావు**



**హుజురాబాద్, మహా :** దళిత బంధు రెండో విడత నిధులు విడుదల చేయాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో చేపట్టిన ధర్నా ఉద్రిక్తంగా మారింది. దళిత కుటుంబాలతో కలిసి అంబేద్కర్ చౌరస్తా వద్ద ధర్నా నిర్వహించేందుకు వస్తుండగా తోపులాట చోటు చేసుకుంది. జిల్లా పోలీసులకు, దళితులకు మధ్య జరిగిన ఈ తోపులాటలో ఓ మహిళకు స్వల్పంగా గాయాలయ్యాయి. అనంతరం దళిత కుటుంబాలతో కలిసి కౌశిక్ రెడ్డి అంబేద్కర్ చౌరస్తా దగ్గర దాదాపు గంట పాటు ధర్నా నిర్వహించారు.

వివరాలు 2లో

---



ప్రధాని అబద్ధాలకు..

## నిజంతో సమాధానం

**తెలంగాణలో ఇచ్చిన హామీలు అమలుచేస్తున్నాం**

ముంబైలో ప్రధాని నరేంద్ర మోడీ

వివరాలు 2లో

---

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల వేళ

## మోడీ, ఖర్గే సభలు

**పరస్పరం తీవ్ర విమర్శలు**

**మహారాష్ట్ర ఎన్నికల ప్రత్యేకం:** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ప్రచారాన్ని హోరెత్తిస్తున్నాయి. వరుస కార్యక్రమాలు ఏర్పాటు నిర్వహిస్తున్నాయి.

వివరాలు 2లో



### సికింద్రాబాద్-శాలీమార్ ఎక్స్‌ప్రెస్

## రైలుకు ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

'మిడిల్ లైన్ నుంచి డౌన్ లైన్‌కు మారుతున్న సమయంలో ఒక పార్శిల్ వ్యాన్, రెండు ప్యాసింజర్ కోచ్‌లు పట్టాలు తప్పాయి. ఈ ఘటనలో ఎవరికి తీవ్ర గాయాలు లేదా ప్రాణనష్టం సంభవించలేదు. ప్రయాణికులకు అందరూ సురక్షితంగా ఉన్నారు. ప్రయాణికులను చేరవేసేందుకు 10 బస్సులను ఏర్పాటు చేశాం.' అని చరణ్ వెల్లడించారు. ఇక రైల్వే ట్రాక్ పునరుద్ధరించే పనిలో రైల్వే సిబ్బంది నిమగ్నమైనట్లు చరణ్ చెప్పారు. వీలైనంత త్వరగా ట్రాక్‌లను క్లియర్ చేసి సాధారణ సర్వీసులను పునరుద్ధరిస్తామన్నారు. దాంతో పాటుగా పట్టాలు తప్పటానికి గల కారణాల పై దర్యాప్తునకు ఆదేశించినట్లు వెల్లడించారు. కాగా, ఈ ప్రమాద ఘటనపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

**మహబూబాబాద్ జిల్లాలో పట్టాలు తప్పిన గూడ్స్ ట్రైన్**

ఇక తెలంగాణలోని మహబూబాబాద్ జిల్లాలో ఓ గూడ్స్ ట్రైన్ పట్టాలు తప్పింది. డోర్నకల్ రైల్వే జంక్షన్ సమీపంలోని ఖమ్మం భద్రాచలం బైపాస్‌లో శుక్రవారం రాత్రి గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. దీంతో బోగీలు చెల్లాచెదురయ్యాయి. కొన్ని బోగీలు పట్టాల నుండి పక్కకు ఒరిగి పోయాయి. ప్రమాదానికి గురైన గూడ్స్ ట్రైన్ బొగ్గు లోడు కోసం భద్రాచలం వైపు వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకున్నట్లు రైల్వే అధికారులు వెల్లడించారు. గూడ్స్ ట్రైన్ పట్టాలు తప్పిన విషయం తెలుసుకున్న అధికారులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్నారు. రైల్వే అధికారులు, సిబ్బంది సహాయక చర్యలు వేగవంతం చేశారు. ట్రాక్ మీద అడ్డంగా ఉన్న బోగీలను పక్కకు తీశారు. యుద్ధ ప్రాతిపదికన రైల్వే ట్రాక్ మరమ్మత్తు పనులు చేపట్టారు. గూడ్స్ ట్రైన్ పట్టాలు తప్పడంతో ఈ రూట్‌లో ట్రైన్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అయితే ఈ ఘటనలోనూ ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో రైల్వే అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. గూడ్స్ ట్రైన్ పట్టాలు తప్పడానికి గల కారణాలపై రైల్వే అధికారులు ఆరా తీస్తున్నారు.

## కలెక్టర్లు ఎన్యూమరేటర్‌లతో మాట్లాడాలి

- మంత్రులు, ఎమ్మెల్యేలకు సమాచారం ఇవ్వండి
- దేశం మొత్తం తెలంగాణను గమనిస్తుంది
- సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వీడియో కాన్ఫరెన్స్ లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



**హైదరాబాద్, మహా :** హౌస్ లిస్టింగ్ పూర్తి చేసుకుని నేటి నుంచి ఇంటింటి సర్వే ప్రారంభమవుతున్న నేపథ్యంలో కలెక్టర్లు ఎన్యూమరెటర్లతో విస్తృతంగా మాట్లాడాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శనివారం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై ఉన్నతాధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో ఆయన మాట్లాడారు. నేటి నుంచి ఇంటింటి సర్వే ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రజల నుంచి అనేక సందేహాలు వ్యక్తమవుతుంటాయి, కలెక్టర్లు ఎన్యూమరెటర్ లతో ఎప్పటికప్పుడు మాట్లాడితే ప్రజల సందేహాలు ఏంటో వెను వెంటనే తెలుసుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు. ప్రజల సందేహాలను కలెక్టర్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి ప్రజల అనుమానాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలని ఆదేశించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ఎక్కువ సార్లు సర్వేలో భాగస్వాములు అయ్యేలా చూడాలని అధికారులను కోరారు. సమగ్ర కుటుంబ సర్వే చాలా పెద్ద కార్యక్రమం, ఇలాంటి కార్యక్రమాన్ని ఇప్పటివరకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ముందుకు తీసుకెళుతున్న అధికారులను డిప్యూటీ సీఎం అభినందించారు. క్వశ్చనీర్ పకడ్బందీగా రూపొందించారు, ఎన్యూమరేటర్లకు బాగా శిక్షణ ఇచ్చారు, హౌస్ లిస్ట్ కూడా విజయవంతంగా పూర్తి చేశారు.

ఇదే రీతిలో కుటుంబ సర్వేను విజయవంతంగా నిర్వహించాలని కోరారు. ఈ దేశంలో జరిగే అతి పెద్ద కార్యక్రమం ఇది, మనం చూపే నిబద్ధతపైనే ఈ సర్వే విజయవంతం అవడం ఆధారపడి ఉంటుందన్నారు. యావత్ దేశం మొత్తం తెలంగాణ రాష్ట్రం చేపడుతున్న కుటుంబ సర్వేను గమనిస్తుందని వివరించారు. ఈ దేశంలో ప్రగతిశీల భావాలను, కార్యక్రమాలను వ్యాప్తి చేయడానికి ఈ సర్వే గొప్పగా ఉపయోగపడుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్లు ప్రతి చిన్న విషయం కూడా నిర్లక్ష్యం చేయకుండా ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి, ఇతర ఉన్న అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించుకోవాలని తెలిపారు. సర్వేపై కలెక్టర్లతో పాటు అన్ని స్థాయిలోని అధికారులు విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. ప్రధానంగా పట్టణాలపై దృష్టి పెట్టాలని కోరారు. కార్యక్రమంలో చీఫ్ సెక్రటరీ శాంత కుమారి, ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఉన్నతాధికారులు పాల్గొన్నారు

## ఇదేమైనా పాకిస్తానా..?



(మొదటిపేజీ తరువాయి)

మూసీ ప్రక్షాళనపై ప్రభుత్వం వద్ద ఉన్న ప్రణాళిక ఏమిటో బహిర్గత పరచకుండా విపక్షాలపై విరుచుకుపడటం ఏమిటని ప్రశ్నించారు. మంూసీ నదికి ఋందుగా రివాల్వింగ్ మాల్ ను నిర్మించి ఆక్రమణలను అరికట్టాలని బీజేపీ కోరుతుందని, దీన్ని సీఎం రేవంత్ రెడ్డి పక్క దారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మరోవైపు సన్న వడ్లకే బోనస్ ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో పంటకైనా రాష్ట్ర ప్రభుత్వం మద్ధతు ధరకు బోనస్ ఇస్తామని చెప్పింది వాస్తవం కాదా రేవంత్ రెడ్డి చెప్పాలన్నారు. ఇప్పుడు కేవలం సన్న వడ్లకు మాత్రమే రూ. 500 బోనస్ ఇస్తామని చెప్పడం రైతాంగాన్ని దగా చేయడం కాదా అని నిలదీశారు. రాష్ట్రంలో ఏ ఒక్క గ్యారెంటీ కూడా అమలు కాలేదని విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో వడ్లకు 500 బోనస్ ప్రకటించి.. ఇప్పుడు మాత్రం సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని అంటున్నారని.. రాష్ట్రంతో 17 లక్షల మందికే రుణమాఫీ చేశారని, మిగిలిన రైతులను వదిలేశారని మండిపడ్డారు. మూసీ ప్రక్షాళనకు లక్షా 50 వేల కోట్లు ఖర్చవుతుందని చెబుతున్నారు. ఆ డబ్బు ఎప్పుడు ఎలా వస్తుందో వారికే తెలియదని, రాష్ట్రంలో రైతులు కష్టపడి పండించిన పంటను కొనే దిక్కులేదని.. రాష్ట్రంలో ఏ ఒక్క గ్యారంటీ అమలు కాలేదని విమర్శించారు. అలాగే కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి దమ్ముంటే.. తెలంగాణ రాష్ట్రంలోని వడ్ల కొనుగోలు కేంద్రాలకు రావాలని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సవాల్ విసిరారు.

## దళిత బంధు కోసం ధర్నా



(మొదటిపేజీ తరువాయి)

ఈ ధర్నాతో కరీంనగర్ వరంగల్ రహదారిపై వాహనాలు భారీగా నిలిచిపోయాయి. వెంటనే ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు కౌశిక్‌రెడ్డిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. శ్వాస తీసుకోవడం రావట్లేదని చెప్పడంతో తక్షణమే వైద్య పరీక్షల నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. దళిత బంధు రెండో విడత నిధులు విడుదల చేయాలని ధర్నా చేస్తే, పోలీసులు తనతోపాటు, ధర్నా చేస్తున్న వారిని తీవ్రంగా కొట్టారని కౌశిక్ రెడ్డి విడుదల చేసిన వీడియోలో ఆరోపించారు.

**కర్కశంగా వ్యవహిస్తారా : హరీష్ రావు ఆగ్రహం**

హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి మాజీ మంత్రి హరీశ్‌రావు ఫోన్ చేసి ఘటన జరిగిన తీరు, ఆరోగ్యం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆందోళన చెందవద్దని, బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ అంశంపైనా న్యాయపరంగా ముందుకెళ్దామని సూచించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకు ప్రజాప్రతినిధి అని కూడా చూడకుండా ఇంత కర్కశంగా వ్యవహరిస్తారా? అని హరీశ్ రావు దుయ్యబట్టారు.

**దళిత బంధు అడిగితే దాడి చేస్తారా? : కేటీఆర్**

ఈ ఘటనపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పందించారు. దళిత బంధు సాయం అడిగితే ఎమ్మెల్యేపై దాడి చేస్తారా? అని ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే దాడి చేయడమేనా ఇందిరమ్మ రాజ్యమంటే? అని మండిపడ్డారు. ప్రభుత్వ పెద్దల మెప్పు పొందేందుకు పోలీసులు పని చేస్తున్నారని మండిపడ్డారు. మా ప్రభుత్వం వచ్చాక తప్పకుండా పోలీసులకు వడ్డీతో సహా చెల్లిస్తామని కేటీఆర్ హెచ్చరించారు. కౌశిక్‌రెడ్డిపై సీఎం రేవంత్‌రెడ్డి కక్ష పెంచుకున్నారని, అరికెపూడి గాంధీతో అతనిపై దాడి చేసే ప్రయత్నం చేశారని, ప్రజల కోసం పోరాడుతున్న ఎమ్మెల్యేపై సీఎం రేవంత్ రెడ్డి దాడి చేయించారన్నారు. కౌశిక్ రెడ్డిపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నా. ఇంత పిరికి ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదు. అరెస్టు చేసిన బీఆర్ఎస్ కార్యకర్తలందర్నీ వెంటనే విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

### మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల వేళ

## మోడీ, ఖర్గే సభలు





(మొదటిపేజీ తరువాయి)

అందులో భాగంగా అకోలాలో ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రచారంలో పాల్గొని ప్రధాని నరేంద్ర మోడీ ప్రతిపక్షాలపై తీవ్ర విమర్శలు చేశారు. మరోవైపు, నాగ్పుర్లో జరిగిన ఎన్నికల సభలో బీజేపీపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు.

**కాంగ్రెస్ కు ఎటిఎంలా ప్రభుత్వాలు - మోడీ**

నవంబరు 9కి చరిత్రలో అత్యంత ప్రాధాన్యం ఉందని మోడీ తెలిపారు. 2019లో సరిగ్గా ఇదేరోజు సుప్రీంకోర్టు రామమందిరంపై తీర్పునిచ్చిందని గుర్తు చేశారు. ఆ తీర్పు తర్వాత ప్రతి మతంలోని ప్రజలు గొప్ప సున్నితత్వాన్ని ప్రదర్శించారని వ్యాఖ్యానించారు. "దేశానికే తొలి ప్రాధాన్యం అనే భావన భారత్‌కు ఉన్న గొప్ప బలం. కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కడ ఏర్పాటైతే ఆ రాష్ట్రాన్ని తమకు ఏటీఎంగా మార్చుకుంటుంది. మహావికాస్ అఘాడీ అంటే అవినీతి, కుంభకోణాలకు నెలవు. కర్ణాటకలో మద్యం విక్రయదారుల నుంచి రూ.700 కోట్లు కొల్లగొట్టారు. ఎన్నికల్లో గెలిస్తే ఇంకెంత దోచుకుంటారో ఊహించండి" అంటూ ప్రధాని మోదీ తీవ్ర ఆరోపణలు చేశారు. హర్యానా ప్రజలు కాంగ్రెస్ కుట్రను భగ్నం చేశారని మోడీ తెలిపారు. దేశాన్ని బలహీనం చేయడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. వివిధ కులాల మధ్య చిచ్చుపెట్టి సమాజాన్ని విడదీసేందుకు ప్రయత్నిస్తోందని, మనమంతా ఐక్యంగా ఉండి వారి కుట్రను భగ్నం చేయాలని పిలుపునిచ్చారు. ఎస్సీల హక్కులను హస్తం పార్టీ హరిస్తోందని ఆరోపించారు. "పదేళ్లలో కేంద్రం పేదలకు పక్కా ఇళ్లు నిర్మించింది. మీరు ఇతర గ్రామాలను సందర్శినప్పుడు ఇల్లు లేని వారు, గుడిసెల్లో నివసించేవారు కనిపిస్తే వారి వివరాలతో సహా చిరునామాను నాకు పంపించండి. అతడికి శాశ్వతంగా ఒక ఇల్లు సొంతం అవుతుందని నా తరఫున హామీ ఇవ్వండి. కచ్చితంగా ఆ హామీని నేను నెరవేరుస్తా. ఎన్నికల్లో మహాయతి కూటమిని గెలిపిస్తారని ఆశిస్తున్నా" అని మోడీ పేర్కొన్నారు.

### ప్రజల దృష్టిని మళ్ళించేందుకే - ఖర్గే ఫైర్

రెచ్చగొట్టే ప్రసంగాలు, అబద్ధాల ద్వారా ప్రధాన సమస్యల నుంచి ప్రజల దృష్టిని బీజేపీ మళ్లిస్తోందని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. రాష్ట్రాన్ని మళ్లీ అభివృద్ధి పథంలోకి తీసుకొచ్చేందుకు మంచి ప్రభుత్వం అవసరమని అన్నారు. మహా వికాస్ అఘాడీ ఎన్నికల్లో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. విదర్భకు చెందిన ఇద్దరు పెద్ద నాయకులు తమ సొంత పదవులను కాపాడుకోవడంపై ఆందోళన చెందుతూనే ఉంటారని ఆరోపించారు. అందుకే ప్రజల ప్రయోజనాలతో సంబంధం లేకుండా గుజరాత్‌కు వెళ్లిపోతున్న పెద్ద పెట్టుబడులను ఆపలేకపోయారని విమర్శించారు. గత 11 ఏళ్లలో బీజేపీ ప్రభుత్వం ఏ పని చేసిందో చెప్పాలని, కాంగ్రెస్‌తో బీజేపీ చర్చకు రావాలని డిమాండ్ చేశారు. 55 ఏళ్లలో తామేం చేసేమో చెబుతామని అన్నారు.

## గ్రూప్-4 అభ్యర్థులకు శుభవార్త

### ఏడాదిన్నర నిరీక్షణకు తెర

### నియామకపత్రాలు అందించనున్న రేవంత్ ప్రభుత్వం

**హైదరాబాద్, మహా:** వరుసగా ఉద్యోగ నియామకాలు చేస్తున్న తెలంగాణ ప్రభుత్వం గ్రూప్4 అభ్యర్థులకు శుభవార్త చెప్పింది. ఈ నెల 14 నుంచి డిసెంబర్ 9 వరకు ఎంపికైన వారికి నియామక పత్రాలు అందిస్తామని ప్రకటించింది. ఈ మేరకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఈ రోజు వివరాలు వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా ఈనెల 14 నుంచి విజయోత్సవాలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఉత్సవాలపై ఈ రోజు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. ఉత్సవాల్లో భాగంగా గ్రూప్4 ఉద్యోగాలకు ఎంపికైన వారిని నియామక పత్రాలు అందించనున్నట్లు తెలిపారు.

**ఏడాదిన్నరగా విడుదల కాని ఫలితాలు**

గ్రూప్4 పరీక్ష నిర్వహించి ఏడాదిన్నర కావొస్తున్న ఫలితాలు విడుదల చేయకపోవడంపై అభ్యర్థులు చాలా రోజులుగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. త్వరగా ఫలితాలు విడుదల చేసి నియామక ప్రక్రియ పూర్తి చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. గత కేసీఆర్ సర్కార్ హయాంలో మొత్తం 8,180 గ్రూప్4 ఉద్యోగాల భర్తీకి టీజీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. గతేడాది జూలైలో ఇందుకు సంబంధించిన పరీక్షను నిర్వహించారు. ఇంతకాలం వివిధ కారణాల రీత్యా వీటి నియామకాలు జరగకపోగా, ఇపుడు కాంగ్రెస్ ప్రభుత్వం మరో ముందడుగు వేసింది.

### ఏపీలో నామినేటెడ్ పోస్టుల

## రెండో జాబితా విడుదల

### .. నైతిక విలువల సలహాదారుగా చాగంటి

**అమరావతి, మహా:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరోసారి పెద్ద సంఖ్యలో నామినేటెడ్ పదవును భర్తీ చేసింది. మొదటి జాబితాలో ఆర్టీసీ, పౌరసరఫరాలు, ఏపీసీఐఐసీ వంటి 20 కీలక కార్పొరేషన్లకు ఛైర్మన్లతో పాటు ఆర్టీసీకి వైస్ ఛైర్మన్‌ను నియమించిన సంగతి తెలిసిందే. తాజాగా రెండో జాబితాలో వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్‌లకు ఛైర్మన్లను నియమించింది. మొత్తం 59 మందితో రెండో జాబితాను విడుదల చేసింది. లిస్టులో ప్రముఖ ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు పేరు కూడా ఉంది. ఆయన్ను రాష్ట్ర నైతిక విలువల సలహాదారుగా నియమించింది. ఆయనకు క్యాబినెట్ ర్యాంక్‌ను ఇచ్చింది.

### ప్రధాని అబద్ధాలకు..

## నిజంతో సమాధానం

### తెలంగాణలో ఇచ్చిన హామీలు అమలుచేస్తున్నాం

### ముంబైలో ప్రధాని నరేంద్ర మోడీ



**ముంబై:** మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోడీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని, తెలంగాణ ప్రభుత్వంపై అబద్ధాలు చెబుతున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం కోసంముంబై వెళ్ళిన సీఎం రేవంత్ రెడ్డి పీసీసీ ఆఫీస్లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. "తెలంగాణ సర్కార్ అమలు కానీ హామీలు ఇచ్చిందని మోడీ అన్నారు. తెలంగాణలో రైతులకు ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల రుణాలు మాఫీ చేశాం. 22 లక్షల మంది రైతులకు 17,829 కోట్ల రూపాయలు రుణమాఫీ చేశాం. ఇందుకు సంబంధించి వివరాలు కావాలంటే ఇవ్వడానికి మేం సిద్ధంగా ఉన్నాం." అని సీఎం వెల్లడించారు. తెలంగాణలో 10 నెలల్లోనే 50 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామన్న రేవంత్రెడ్డి, మహారాష్ట్ర బీజేపీ నేతలు తెలంగాణ సర్కార్పై ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రధాని కాంగ్రెస్ గ్యారంటీల అమలుపై అబద్ధాలు చెబుతున్నారని, ఆయన అబద్ధాలు చెప్పడం మానుకోకపోతే మేం నిజాలు చెబుతూనే ఉంటామని వ్యాఖ్యానించారు. మహారాష్ట్ర ప్రజలకు ఆరు గ్యారంటీల అమలుపై నిజాలు చెప్పేందుకు వచ్చానన్న ఆయన, ఇక్కడ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సంక్షేమాన్ని మరిచాయని పేర్కొన్నారు. నల్ల చట్టాలు తెచ్చి అదానీ, అంబానీలకు మేలు చేయాలని ప్రధాని మోడీ భావించారని ఆరోపించారు. సామాజిక న్యాయం అందించేందుకు తెలంగాణలో కులగణన చేపట్టినట్లు తెలిపిన రేవంత్రెడ్డి, దేశ చరిత్రలో మహారాష్ట్రకు ప్రత్యేక స్థానం ఉందని కొనియాడారు. ఇక్కడికి రావాల్సిన 17 మెగా ప్రాజెక్టులు గుజరాత్‌కు వెళ్లాయని ఆరోపించారు. ఇక్కడి ప్రజలను మోసం చేసిన బీజేపీని ఎన్నికల్లో ఓడించాలని రేవంత్‌రెడ్డి కోరారు. సమావేశంలో కర్నాటక డిప్యూటీ సీఎం డికె శివకుమార్ పాల్గొన్నారు.

## అప్రూవర్‌గా అమోయ్ కుమార్?

### చిక్కుల్లో గులాబీ నేతలు..

### కదులుతున్న భారీ కుంభకోణాల డొంక



**హైదరాబాద్, మహా:** ఐఏఎస్ అమోయ్‌కుమార్‌కు సంబంధించిన వ్యవహారం రోజురోజుకు కీలక మలుపు తిరుగుతోంది. రంగారెడ్డి జిల్లాలో భూదాన్ భూముల అక్రమ బదలాయింపులో అమోయ్ కుమార్ పాత్రపై పూర్తిగా దర్యాప్తు జరిపి కేసు నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని ఈడీ అధికారులు డీజీపీ జితేందర్‌ను కోరారు. అమోయ్ కుమార్ కూడా ఈ వ్యవహారంలో అప్రూవర్‌గా మారనున్నట్లు తెలుస్తోంది. దీంతో కేసీఆర్, కేటీఆర్, ఇతర బీఆర్ఎస్ నేతలు ఇబ్బందికర పరిస్థితి ఎదుర్కొంటారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**అసలు కథ ఇదీ**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం గ్రామంలో 42 ఎకరాల భూములను ప్రైవేటు వ్యక్తులకు అక్రమంగా కట్టబెట్టడంలో మనీలాండరింగ్ జరిగిందనే ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారంలో రంగారెడ్డి జిల్లా పూర్వ కలెక్టర్ అమోయ్‌కుమార్ పాత్ర ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు రంగంలోకి దిగారు. ఈ కేసుకు సంబంధించి శుక్రవారం డీజీపీ జితేందర్‌ను కలిశారు. ఇందులో అమోయ్‌కుమార్ పాత్రపై పూర్తిగా దర్యాప్తు జరిపి కేసులు నమోదు చేసేలా స్థానిక పోలీసులను ఆదేశించాలని కోరారు. రంగారెడ్డి అలాగే మేడ్చల్ జిల్లాల్లో అమోయ్ కుమార్ కలెక్టర్‌గా ఉన్నప్పుడు భూ లావాదేవీలపై వచ్చిన ఫిర్యాదులపై దర్యాప్తు జరపాలని కోరారు. పలువురు బాధితులు ఇప్పటికే చేసిన 12 ఫిర్యాదుల వ్యవహారాన్ని డీజీపీ దృష్టికి తీసుకెళ్లారు. నాగారం భూదాన్ భూముల విషయంలో వివరాలు అడిగినా కూడా పోలీసులు స్పందించలేదని ఈడీ అధికారులు డీజీపీకి చెప్పారు. తమ విచారణలో ప్రాథమికంగా లభించిన ఆధారాలను డీజీపీకి సమర్పించారు. అయితే ఈడీ అధికారులు డీజీపీని కలిసి వివరాలు ఇవ్వడం చర్చనీయం అవుతోంది. వాస్తవానికి పోలీసులు నమోదు చేసిన కేసుల ఆధారంగానే ఈడీ అధికారులు మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ నమోదు చేస్తుంటారు. అలాగే ఈ కేసుల వివరాల సేకరణ ప్రక్రియ అంతా కూడా ఉత్తర ప్రత్యుత్తరాల ద్వారానే జరుగుతూ ఉంటుంది.

## 2025 సెలవుల జాబితా విడుదల

**హైదరాబాద్, మహా:** తెలంగాణ ప్రభుత్వం వచ్చే ఏడాది 2025కి సంబంధించిన సెలవుల జాబితాను విడుదల చేసింది. 2025లో మొత్తం 27 సాధారణ సెలవులు, 23 ఐచ్ఛిక సెలవులు ప్రకటించింది. ఈ మేరకు సీఎస్ శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు.

**సాధారణ సెలవులు - 2025**

న్యూ ఇయర్ డే : 01012025(బుధవారం)
భోగి : 13012025(సోమవారం)
సంక్రాంతి : 14012025(మంగళవారం)
రిపబ్లిక్ డే : 26012025(ఆదివారం)
మహా శివరాత్రి : 26022025(బుధవారం)
హోలీ : 14032025(శుక్రవారం)
ఉగాది : 30032025(ఆదివారం)
ఈద్ ఉల్ ఫిత్ర్ (రంజాన్) : 31032025(సోమవారం)
రంజాన్ తరువాతి రోజు : 01042025(మంగళవారం)
బాబు జగ్జీవన్ రామ్ జయంతి : 05042025(శనివారం)
శ్రీరామ నవమి : 06042025(ఆదివారం)
డి.ఆర్.బి.ఆర్. అంబేద్కర్ జయంతి 1404 2025(సోమవారం)
గుడ్ ఫ్రైడే : 18042025(శుక్రవారం)
ఈదుల్ అజా (బక్రీద్) : 07062025(శనివారం)
మొహరం : 06072025(ఆదివారం)
బోనాలు : 21072025(సోమవారం)
స్వాతంత్ర్య దినోత్సవం : 15082025(శుక్రవారం)
శ్రీ కృష్ణాష్టమి : 16082025(శనివారం)
వినాయక చవితి : 27082025(బుధవారం)
ఈద్ మిలాదున్ నబీ : 05092025(శుక్రవారం)
బతుకమ్మ పండుగ ప్రారంభ రోజు : 21092025 (ఆదివారం)
మహాత్మా గాంధీ జయంతి/విజయ దశమి : 0210 2025(గురువారం)
విజయ దశమి తరువాతి రోజు : 03102025(శుక్రవారం)
దీపావళి : 20102025(సోమవారం)
కార్తీక పూర్ణిమ/ గురునానక్ జయంతి : 0511 2025(బుధవారం)
క్రిస్మస్ తరువాతి రోజు : 25122025(గురువారం)
క్రిస్మస్ (బాక్సింగ్ డే) : 26122025(శుక్రవారం)

**ఐచ్ఛిక సెలవులు 2025**

హజ్రత్ అలీ పుట్టినరోజు (సంక్రాంతి దృష్ట్యా సాధారణ సెలవుదినం) : 14012025(మంగళవారం)
కనుము : 15012025(బుధవారం)
షాబ్ఇమెరాజ్ : 28012025(మంగళవారం)
శ్రీ పంచమి : 03022025(సోమవారం)
షబ్ఎబరాత్ : 14022025(శుక్రవారం)
షాహదత్ అలీ : 21032025(శుక్రవారం)
జుమాతుల్ వాద / షాబ్ఇఖాదర్ : 28032025(శుక్రవారం)
మహావీర్ జయంతి : 10.04.2025(గురువారం)
తమిళ నూతన సంవత్సర దినోత్సవం (డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతి దృష్ట్యా సాధారణ సెలవుదినం) : 14042025(సోమవారం)
బసవ జయంతి : 30042025(బుధవారం)
బుద్ధ పూర్ణిమ : 12052025(సోమవారం)
ఈద్ఎగదీర్ : 15062025 (ఆదివారం)
రథ యాత్ర : 27062025(శుక్రవారం)
9వ మొహర్రం : 05072025(శనివారం)
వరలక్ష్మీ వ్రతం : 08082025(శుక్రవారం)
శ్రావణ పూర్ణిమ/రాఖీ పూర్ణిమ : 0908 2025(శనివారం)
పార్సీ నూతన సంవత్సర దినోత్సవం/(స్వతంత్ర్య దినోత్సం దృష్ట్యా సాధారణ సెలవు) : 15.08.2025(శుక్రవారం)
దుర్గాష్టమి : 30.09.2025(మంగళవారం)
మహర్నవమి : 01102025(బుధవారం)
యాజ్ దహుమ్ షరీఫ్ : 04102025(శనివారం)
నరక చతుర్ధి : 19102025(ఆదివారం)
. సయ్యద్ మహ్మద్ జువాన్‌పురి మహదీ మౌద్ జయంతి : 16112025 (ఆదివారం)
క్రిస్మస్ ఈవ్ : 24122025(బుధవారం)

### ఈనెల 14 నుండి డిసెంబర్ 9వ తేదీ వరకు

# ప్రజా విజయోత్సవాలు

## గత పది నెలల్లో ఊహకందని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు

### ప్రజలు విస్తృతంగా పాల్గొనాలని పిలుపు నిచ్చిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పడి ఒక సంవత్సరం పూర్తి అవుతున్నందున ఈ నెల 14 వ తేదీ నుండి డిసెంబర్ 9 వ తేదీ వరకు 26 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రజా విజయోత్సవాలను నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు వెల్లడించారు. ఈ ఉత్సవాల నిర్వహణపై ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన శనివారం సచివాలయంలో జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు కె. కేశవరావు, వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, రాష్ట్ర సాహిత్య అకాడమీ అధ్యక్షురాలు అలేఖ్య పుంజాల, ప్రజాకవి జయరాజ్, వివిధ శాఖల కార్యదర్శులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ సి.ఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ, రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం ఈ సంవత్సర కాలంలో దేశంలోని మరే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టలేని ఎన్నో విప్లవాత్మక, ఊహకు అందని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమాలను షో కేస్ చేస్తూ, ప్రభుత్వ విజన్ ను తెలియచేసేవిధంగా ఈ కార్యక్రమాలను రూపొందిస్తున్నామని వివరించారు. ఈ 26 రోజుల కార్యక్రమాల్లో ప్రభుత్వ గ్యారెంటీ పథకాలైన మహిళలకు ఆర్టీసీ లో ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500 లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రాజీవ్ ఆరోగ్య శ్రీ, ఇందిరా మహిళా శక్తి తదితర పథకాలతో పాటు, ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక అధివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై చైతన్య పరుస్తామని తెలిపారు. ఇప్పటికే 50 వేల ఉద్యోగాలను ఇవ్వడం జరిగిందని, దాదాపు రూ. 18 వేల కోట్ల రూపాయల వ్యవసాయ రుణాల మాఫీ చేయడంతోపాటు మహిళా సంఘాలకు 20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలను అందచేశామని గుర్తు చేశారు. మూతపడిన కమలాపూర్ రేయన్స్ పరిశ్రమను 4వేల కోట్లతో పునరుద్ధరించబోతున్నామని తెలిపారు.

పండిట్ జవహర్ లాల్ నెహ్రు జన్మదినం రోజున ప్రారంభమయ్యే ఈ ప్రజా విజయోత్సవాల సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తామని, చివరి రోజైన డిసెంబర్ 9 న హైదరాబాద్ నగరంలో వేలాది మంది కళాకారులతో ప్రదర్శనలు, లేజర్ షోలు, క్రాకర్స్ ప్రదర్శన తదితర కార్యక్రమాలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ మధ్యకాలంలో తెలంగాణా పబ్లిక్ సర్వీస్ కమీషన్ ద్వారా నిర్వహించిన గ్రూప్ 4 పరీక్షలో ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందచేయడం జరుగుతుందని, వివిధ శాఖలకు సంబందించిన పాలసీ విధానాలను ప్రకటిస్తామని వివరించారు. పలు కంపెనీలతో పరిశ్రమల ఏర్పాటుకు ఒప్పందాలు కుదుర్చడం, స్పోర్ట్ యూనివర్సిటీకి ఫౌండేషన్, 16 నర్సింగ్ కళాశాలలు, 28 పారా మెడికల కళాశాలల ప్రారంభోత్సవం, ఉస్మానియా ఆసుపత్రి నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన, తదితర కార్యక్రమాలను ఏర్పాటు చేశామని భట్టి విక్రమార్క వెల్లడించారు. కొత్తగా ఏర్పాటు చేసిన రాష్ట్ర డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ ప్రారంభం ఉంటుందని అన్నారు అదే విధంగా, పోలీస్ శాఖ ద్వారా డ్రగ్స్ వ్యతిరేక కార్యక్రమాలు, డాగ్ షోలు, పోలీస్ బ్యాండ్ ప్రదర్శనలను కూడా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమాలకు సంబంధించి పకడ్బందీ ఏర్పాట్లను చేయాలని సంబంధిత శాఖల కార్యదర్శులను ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ముఖ్య కార్యదర్శులు రవీ గుప్త, క్రిస్టినా జోంగ్తు, ఎం.శ్రీధర్, కార్యదర్శి దాసరి హరిచందన, లోకేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మహారాష్ట్రలో రేవంత్ చెప్పేవన్నీ అబద్ధాలే

## 6 గ్యారంటీల అమలుపై తెలంగాణలో పాదయాత్ర చేసే దమ్ముందా?

### నక్సలైట్ల భావజాలమున్న వాళ్లకు విద్యా కమిషన్ లో చోటు కల్పిస్తారా?
### కేసీఆర్ ను ఎప్పుడో మర్చిపోయారు?
### జనం కష్టాల్లో ఉన్నా ఫాంహౌజ్ కే పరిమితమయ్యాడు
### కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ హాట్ కామెంట్స్



**కరీంనగర్, మహా :** తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహారాష్ట్రకు పోయి పచ్చి అబద్ధాలు వల్లిస్తున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. ప్రజలకిచ్చిన హామీల అమలు, రుణమాఫీ, 6 గ్యారంటీలపై తెలంగాణలో ప్రజలకు వివరిస్తూ పాదయాత్ర చేసే దమ్ముందా? అని ప్రశ్నించారు. నక్సలైట్ల భావజాలమున్న వాళ్లకు విద్యా కమిషన్ లో చోటు కల్పించి సభ్య సమాజానికి ఏ సంకేతాలు పంపుతున్నారని నిలదీశారు. ఆనాడు నక్సలైట్లను కాంగ్రెస్ నాయకులను కూడా దారుణంగా చంపిన విషయం మర్చిపోయారా? అని ప్రశ్నించారు. బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. టైగర్ జితేందర్ రెడ్డి మూవీని చూసే అవకాశం కలిగిందని, చదువుకునే సమయంలో దేశం కోసం బలిదానాలు చేసిన ఏబీవీపీ విద్యార్థుల చరిత్రను తెలుసుకున్నాని, వాళ్ల త్యాగాలు వృధా కాకుండా దేశం కోసం పనిచేయాలని నేను కూడా ఏబీవీపీలో పనిచేసి రాజకీయాల్లోకి వచ్చిన అని అన్నారు. నాడు ఒక్క కార్యకర్త బలిదానమైతే... వందల మంది కార్యకర్తలు పుట్టుకొచ్చారన్నారు. జితేందర్ రెడ్డి బలిదానంతో వేలాది మంది పుట్టుకొచ్చారని పేర్కొన్నారు. నక్సలైట్లు చంపుతారని తెలిసినా ఏనాడూ ఏ కార్యకర్త భయపడలేదని, నమ్మిన సిద్ధాంతం, ధర్మం కోసం పోరాడిన చరిత్ర ఏబీవీపీదేనాని ప్రశంసించారు

దేశంలో ఏ నాయకులు జాతీయ జెండా కోసం బలిదానం కాలేదని, జాతీయ జెండా కోసం బలిదానమైన వ్యక్తులు మిలటరీ సైనికులు. ఏబీవీపీ కార్యకర్తలు మాత్రమేనాని అన్నారు. సామ జగన్ మోహన్ రెడ్డి, మధుసూదన్ గౌడ్, జయానంద్ మాదిరిగా వేలాది మంది కార్యకర్తలు ప్రాణత్యాగం చేశారన్నారు. దురదృష్టవశాత్తు కాంగ్రెస్ ప్రభుత్వం ఇయాళ మావోయిస్టు భావజాలమున్న వాళ్లకు విద్యా కమిషన్ లో చోటు కల్పించడం సిగ్గు చేటన్నారు నక్సలైట్ భావజాలమున్న వారివల్లే ఎంతో మంది జితేందర్ రెడ్డి లాంటోళ్లు చనిపోయారు. మరి రేవంత్ రెడ్డి సర్కార్ ఏ సంకేతాలు పంపుతోంది? నక్సలైట్ల చేతిలో కాంగ్రెస్ కార్యకర్తలు కూడా బలైపోయారు. విద్యా కమిషన్ లో నక్సలైట్ భావజాలమున్న వాళ్లకు చోటు కల్పించడం ద్వారా వారి త్యాగాలను కూడా వృధా చేశారని మండి పడ్డారు. జాతీయ వాదులు, ప్రజాస్వామ్యాన్ని కోరుకునే వాళ్లంతా నూతన విద్యా కమిషన్ ను రద్దు చేయాలని కోరాలని పిలుపు నిచ్చారు. రేవంత్ సర్కార్ కూడా తక్షణమే కమిషన్ ను రద్దు చేసి కొత్త వారికి చైర్మన్, సభ్యులుగా అవకాశం కల్పించాలని సంజయ్ కోరారు

#### అబద్ధాలంటేనే కాంగ్రెస్

మోసాలు, అబద్ధాలకు కేరాఫ్ అడ్రస్ రేవంత్ రెడ్డి అని, మహారాష్ట్రకు పోయి అబద్ధాలు చెప్పడం దారుణం అన్నారు. కాంగ్రెస్ పార్టీ నిజంగా 6 గ్యారంటీలను అమలు చేసి ఉంటే.. కోట్లు ఖర్చు పెట్టి మహారాష్ట్రలో ఇచ్చిన యాడ్స్ లో ఆ విషయం ఎందుకు ప్రస్తావించలేదు? ప్రతి ఒక్కరికీ రుణమాఫీ అమలు చేశామని చెప్పిన రేవంత్ రెడ్డి... ఇంకా 20 లక్షల మంది రైతులకు నయాపైసా రుణమాఫీ కాలేదని చెప్పే దమ్ముందా? మహిళలకు తులం బంగారం, స్కూటీ, నెలనెలా రూ.2500లు, నిరుద్యోగులకు రూ.2 లక్షల మాఫీ, విద్యార్థులకు రూ5 లక్షల భరోసా కార్డు, వృద్ధులకు నెలనెలా రూ.4 వేల ఫించన్, పేదలందరికీ ఇండ్లు ఇచ్చారా? ఇవేమీ అమలు చేయకుండా మహారాష్ట్రకు పోయి పచ్చి అబద్ధాలు చెప్పడం సిగ్గు చేటన్నారు. మేం కూడా మహారాష్ట్రలో తెలంగాణలోని కాంగ్రెస్ సర్కార్ బండారాన్ని బయటపెడతామన్నారు 6 గ్యారంటీలు, రుణమాఫీపై నిర్వహించిన సర్వేలో కాంగ్రెస్ ప్రభుత్వంపట్ల విపరీతమైన వ్యతిరేకత వచ్చిందని, అందుకే నివేదికను బయటపెట్టేందుకు కూడా రేవంత్ సర్కార్ వెనుకాడుతోందన్నారు ఇప్పటికే హిమాచల్ ప్రదేశ్, కర్నాటక, తెలంగాణలో ప్రజలను మోసం చేసి ఓట్లు దండుకున్న కాంగ్రెస్ పార్టీకి హర్యానాలో కర్రు కాల్చి వాతపెట్టారని, ఈసారి మహారాష్ట్రలో కూడా అదే జరగబోతోందని జోస్యం చెప్పారు.

బీజేపీపై యుద్ధం చేస్తామని రేవంత్ రెడ్డి చెప్పడం సిగ్గుచేటని, దేనికోసం యుద్ధం చేస్తారు? ఈ దేశంలో 80 కోట్ల మందికి ఉచిత బియ్యం ఇస్తున్నందుకా? 25 కోట్ల మందిని పేదరికం నుండి బయటకు తీసుకొచ్చినందుకా? ట్రైబల్ వర్సిటీ ఇచ్చినందుకా? ట్రిబుల్ ఆర్ రోడ్డుకు నిధులు ఇస్తున్నందుకా? స్మార్ట్ సిటీ నిధులు ఇస్తున్నందుకా? గ్రామాలకు నిధులు ఇస్తున్నందుకా? జాతీయ రహదారుల కోసం రూ.లక్ష కోట్లకుపైగా ఖర్చు చేస్తున్నందుకా? అని నిలదీశారు.

కేసీఆర్ సర్కార్ తెలంగాణలోని ఒక్కో కుటుంబంపై లక్ష రూపాయలకు పైగా అప్పు చేసి దోచుకుంటే... కాంగ్రెస్ ప్రభుత్వం అంతకు మించి అప్పులు చేస్తూ ప్రజలను బిచ్చగాళ్లను చేస్తోందని విరుచుకు పడ్డారు. తెలంగాణలో ప్రజలు కేసీఆర్ ను మర్చిపోయారని, అందుకే ఫాంహౌజ్ కే పరిమితమైండు అని వ్యాఖ్యనించారు. ఎన్నికలప్పుడే బయటకొచ్చే కేసీఆర్ లాంటి నాయకుడిని తెలంగాణ సమాజం లీడర్ గా భావించదని, వరదలొస్తే బయటకు రాలే, రైతులు అరిగోస పడుతుంటే రాలే, నిరుద్యోగులు రోడ్డున పడితే రాలే.. 6 గ్యారంటీలను అమలు చేయకుండా మోసం చేస్తే రాలే.. కానీ కేటీఆర్ బామ్మర్ది రేవ్ పార్టీలో దొరికితే మాత్రం డీజీపీకి ఫోన్ చేస్తడు... తెలంగాణ ప్రజలు కేసీఆర్ కుటుంబాన్ని ఇక ఎన్నడూ నమ్మరు. కేసీఆర్ పాలనను తలుచుకుంటేనే ప్రజల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నయ్. కాంగ్రెస్ కూడా అంతకుమించి దారుణమైన పాలన చేస్తోంది. తెలంగాణ ప్రజల పరిస్థితి పెనం మీద నుండి పొయ్యి మీద పడ్డట్లయింది. ఈసారి అందుకే రాబోయే ఎన్నికల్లో తెలంగాణ ప్రజలంతా బీజేపీకి ఓటేసి గెలిపించేందుకు సిద్ధమయ్యారన్నారు.

# పిచ్చిమాటలొద్దు

(మొదటిపేజీ తరువాయి)

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ ఆధ్వర్యంలో కేసీఆర్ ను ఎర్రవల్లిలోని ఆయన ఫామ్ హౌజ్ లో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పాలకుర్తి అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నేతలు కలిశారు. సినిమా ప్రొడ్యూసర్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి , సినీ ఆర్టిస్ట్ రవితేజ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి కేసీఆర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడారు. జరుగుతున్నది అందరికీ తెలుసన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు గెలవాలని తాను గతంలో అనేక ఎన్నికల సభల్లో చెప్పానని గుర్తు చేశారు. అంతే ప్రజలు పొరపాటున ఏదో ఓ మాయలో పడి గాలికి ఓటెస్తే.. వారికే నష్టం, కష్టం జరుగుతుందన్నారు. ఇప్పుడు అదే జరుగుతోందన్నారు. ఎన్నికల్లో ఓడిపోయినంత మాత్రాన బీఆర్ఎస్ కు వచ్చిన ఇబ్బందేమీ లేదన్నారు. శూన్యంలో నుంచి సునామీ సృష్టించిన చరిత్ర తమదన్నారు. ప్రజలు ఏం కోల్పోయారో వారికి అర్థం అయ్యిందన్నారు. తాము 10 శాతమే హామీలు ఇచ్చామన్నారు. మేనిఫెస్టోలో చెప్పిన హామీల కన్నా కూడా 90 శాతం ఎక్కువగా అమలు చేసిన చరిత్ర తమదన్నారు. ప్రజలు మీకు అవకాశం ఇచ్చింది సేవ చేయడానికి, అంతే కానీ కూలగొడతామంటూ పిచ్చిగా మాట్లాడొద్దని ఫైర్ అయ్యారు. ప్రభుత్వం అంటే అందరినీ కాపాడాలి కానీ.. భయపెట్టొద్దన్నారు.

**కేసీఆర్ కొత్త వ్యూహం**

మూసీ ప్రక్షాళనపై పట్టుదలగా ఉన్న సీఎం రేవంత్ పాదయాత్ర సందర్భంగా కేసీఆర్ పై తీవ్ర వ్యాఖ్యలు చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో కేసీఆర్ ఎర్రవెల్లి ఫాంహౌజ్ లో తాజా వ్యాఖ్యలపై పరోక్షంగా స్పదించారు. ఈరేస్, కాళేశ్వరం, విద్యుత్ ప్రాజెక్టులపై ఆరోపణలు వినబడుతున్న నేపథ్యంలో ఈ ఏడాది కేసీఆర్ బయటకు రారని చర్చ జరుగుతోంది. అయితే ఒక్కసారిగా కేసీఆర్ తాజా రాజకీయాలపై స్పదించడం పొలిటికల్ హీట్ ను పెంచింది. దీనిపై కేసీఆర్ వ్యూహమేంటన్న చర్చ జరుగుతోంది.

# జై ఇందిరమ్మ

### బిజెపి ఎమ్మెల్యేల తాజా స్లోగన్

(మొదటిపేజీ తరువాయి)

బిజెపి ఎమ్మెల్యేలున్న పలు నియోజకవర్గాల్లో ఈ తరహా విచిత్ర రాజకీయ పరిస్థితులు నెలకొన్నాయి. ఆదిలాబాద్ లో నాలుగు, నిజామాబాద్ లో మూడు, హైదరాబాద్ లో ఒక స్థానంలో బిజెపి గెలుపొందింది. ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లోని పలువురు బిజెపి ఎమ్మెల్యేల తీరును చూసి ఆ పార్టీ అధిష్టానం విస్తుపోతోంది.

**బోథ్‌లో బాహాబాహీ**

బోథ్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ ఎమ్మెల్యేకు ఈ తరహా అవకాశం కల్పించడంతో అక్కడి క్యాడర్ నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంత్రి రేవంత్ రెడ్డి ఫ్లెక్సీని కొందరు బీఆర్ఎస్ నాయకులు చింపి వేయడంతో పెద్ద దుమారం నెలకొంది. ఇటీవల జరిగిన జిల్లాల సమీక్షల్లో ఇందిరమ్మ కమిటీల్లో కాంగ్రెస్ క్యాడర్ కు మాత్రమే అవకాశం ఇవ్వాలని తీర్మానించినా, పలు జిల్లాల్లో విపక్ష ఎమ్మెల్యేలున్న నియోజకవర్గాల్లో కాంగ్రెస్ భవిష్యత్తును కొందరు అధికారులు పణంగా పెడుతున్నారని ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదులు అందుతున్నాయి. పలు నియోజకవర్గాల్లో నెలకొన్న తాజా పరిస్థితులపై ముఖ్యమంత్రి కార్యాలయం ఆరా తీస్తున్నది. ఇందిరమ్మ కమిటీలపై ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ గ్రూపుల మధ్య వివాదాలు జరుగుతుండగా, ఇపుడు కొత్తగా ప్రత్యర్థి పార్టీలకు కూడా అవకాశం ఇవ్వాలంటే దీనివల్ల అధికారపార్టీకి లభించే ఫాయిదా ఏముంటుందన్న చర్చను పలువురు నేతలు లేవనెత్తుతున్నారు. కాంగ్రెస్ అధిష్టానం, ప్రభుత్వం ఈ వ్యవహారాన్ని ఎలా సమన్వయం చేస్తుంది? అన్న అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. కొందరు అధికారుల అత్యుత్సాహం వల్లే సమస్యలు వస్తున్నాయన్న అభిప్రాయం ఉన్నతస్థాయిల్లో వ్యక్తమవుతోంది.

# తెలంగాణపై ప్రధాని చెప్పేవన్నీ అబద్ధాలే

## రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం రుణమాఫీ చేశాం

### 10 నెలల్లోనే 50 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాం

### మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో రేవంత్ రెడ్డి



**మహా, ముంబాయి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంపై ప్రధాని అబద్ధాలు చెబుతున్నారని సిఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం కోసం రేవంత్‌రెడ్డి ముంబయి వెళ్లారు. అక్కడి పీసీసీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ''తెలంగాణ ప్రభుత్వం అమలు కానీ హామీలు ఇచ్చిందని మోదీ అన్నారు. తెలంగాణలో రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం రూ.2 లక్షల రుణాలు మాఫీ చేశాం. 22 లక్షల మంది రైతులకు రూ.17,829 కోట్లు రుణమాఫీ చేశాం. ఇందుకు సంబంధించి వివరాలు కావాలంటే ఇవ్వడానికి మేం సిద్ధం.

తెలంగాణలో 10 నెలల్లోనే 50 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాం. మహారాష్ట్ర బిజెపి నేతలు తెలంగాణ ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు. ప్రధాని కాంగ్రెస్ గ్యారంటీల అమలుపై అబద్ధాలు చెబుతున్నారు. ఆయన అబద్ధాలు చెప్పడం మానుకోకపోతే మేం నిజాలు చెబుతూనే ఉంటాం. మహారాష్ట్ర ప్రజలకు 6 గ్యారంటీల అమలుపై నిజాలు చెప్పేందుకు వచ్చా. ఇక్కడ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సంక్షేమాన్ని మరిచాయి. నల్ల చట్టాలు తెచ్చి అదానీ, అంబానీలకు మేలు చేయాలని మోదీ భావించారు. సామాజిక న్యాయం అందించేందుకు తెలంగాణలో కులగణన చేపట్టాం. దేశ చరిత్రలో మహారాష్ట్రకు ప్రత్యేక స్థానం ఉంది. ఇక్కడికి రావాల్సిన 17 మెగా ప్రాజెక్టులు గుజరాత్‌కు వెళ్లాయి. ఇక్కడి ప్రజలను మోసం చేసిన భాజపాను ఎన్నికల్లో ఓడించాలి'' అని రేవంత్‌రెడ్డి అన్నారు.



### చిలకలూరిపేటకు

# మళ్లీ రజని

**మహా, అమరావతి:** ఉమ్మడి గుంటూరు జిల్లాలోని తాడికొండ, చిలకలూరిపేట నియోజకవర్గాలకు వైకాపా కొత్త సమన్వయ కర్తలను నియమించింది. తాడికొండలో సుచరితను తప్పించి బాలవజ్రబాబును, చిలకలూరిపేటలో కావటి మనోహర్‌నాయుడు స్థానంలో విడదల రజినిని పంపింది. గత ఎన్నికల్లో ఉమ్మడి గుంటూరు జిల్లాలో దారుణ పరాజయాన్ని మూటగట్టుకున్న వైకాపా నుంచి నేతలు ఒక్కొక్కరుగా బయటకొచ్చి తెదేపా, జనసేనల్లో చేరుతున్నారు. కొందరు వైకాపాలోనే స్తబ్ధుగా ఉన్నారు. కొన్ని నియోజకవర్గాల్లో పార్టీ బాధ్యులు కార్యకర్తలకు అందుబాటులో ఉండకపోవడం, సమన్వయకర్తలుగా కొనసాగేందుకు ముందుకు రాకపోవడంతో పార్టీ నాయకత్వం కొత్తవారిని వెదుకుతోంది.

### శ్రీశైలం మల్లన్న సన్నిధిలో

# సీఎం చంద్రబాబు

### పూర్ణకుంభంతో స్వాగతం పలికిన అధికారులు



**శ్రీశైలం, మహా:** ద్వాదశాలలో రెండవ జ్యోతిర్లింగం... ఆరవ అష్టాదశ శక్తిపీఠం... ఇలలో వెలసిన కైలాసంగా ప్రసిద్ధి చెందిన శ్రీశైలంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్ల దర్శనార్థం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శనివారం మధ్యాహ్నం భ్రమరాంబ మల్లికార్జున స్వామి దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం రాష్ట్ర ముఖ్యమంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి, వేదమంత్రాలతో స్వామి వారి దర్శనార్థం ఆలయంలోకి తీసుకువెళ్లారు.

**రత్నగర్భ గణపతిని దర్శించుకున్న ముఖ్యమంత్రి**

అనంతరం శ్రీశైల మల్లికార్జున స్వామిని, శ్రీ భ్రమరాంబ అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి మరియు మంత్రులు పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి మండపంలో ముఖ్యమంత్రికి వేద పండితులు వేదాశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



## హెచ్ఎస్‌బీసీ బ్యాంక్ పేరిట

# తప్పుడు సందేశాలు

### తన కస్టమర్లను అప్రమత్తం చేసిన హెచ్ఎస్‌బీసీ

**మహా, జాతీయం:** హెచ్ఎస్‌బీసీ బ్యాంక్ తన కస్టమర్లను అప్రమత్తం చేసింది. బ్యాంక్ పేరిట వస్తున్న నకిలీ కాల్స్, సందేశాలతో జాగ్రత్తగా ఉండాలని సూచించింది. ఈమేరకు కస్టమర్లకు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న మొబైల్ నంబర్లు, వాట్సప్ ఛానళ్ల గురించి తెలియజేసింది. హెచ్ఎస్‌బీసీ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ సీఐఓ (చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్) అయిన వేణుగోపాల్ మంఘాట్‌తో సంబంధం ఉన్నట్లు కొందరు తప్పుడు ధ్రువీకరణతో కస్టమర్లకు వల వేస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందని ప్రైవేట్ బ్యాంక్ తెలిపింది. '85HSBC Global academy' పేరిట ఆ కేటుగాళ్లు వాట్సప్ గ్రూప్ నడుపుతున్నారని, ఇది సంస్థకు సంబంధించినది కాదని స్పష్టంచేసింది. '8008723938' ఫోన్ నంబర్‌తో వినియోగదారులను కేటుగాళ్లు కాంటాక్ట్ అవుతున్నారని, ఈ నంబర్ నుంచి వచ్చే కాల్స్‌ను నమ్మొద్దంటూ మెయిల్ ద్వారా కస్టమర్లకు సూచించింది. కేవలం వాట్సప్‌లోనే కాకుండా ఎక్స్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, లింక్డిన్, యూట్యూబ్ వేదికగా మోసాలకు పాల్పడుతున్న వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

# రష్యాలో మినిస్ట్రీ ఆఫ్ సెక్స్ పేరిట కొత్త శాఖ


## జననాల రేటును పెంచే కార్యక్రమాల నిర్వహణ



**మహా, జాతీయం:** గత కొన్నేళ్లుగా రష్యాలో జననమరణాల్లో అంతరం భారీగా పెరుగుతున్నట్లు అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈ తరుణంలో మినిస్ట్రీ ఆఫ్ సెక్స్ పేరిట కొత్త శాఖను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదన వచ్చింది. కుటుంబ రక్షణకు సంబంధించిన పార్లమెంట్ కమిటీ ఇప్పుడు దానిని పరిశీలిస్తోందని అంతర్జాతీయ వమీడియా కథనం పేర్కొంది.

జనన మరణాల రేటులో అంతరాన్ని తగ్గించేందుకు సరికొత్త వ్యూహాలను అమలు చేయాలంటూ అధ్యక్షుడు పుతిన్ పిలుపు ఇచ్చిన నేపథ్యంలో ఓ ఏజెన్సీ ఈ ప్రతిపాదన చేసింది. జననాల రేటును పెంచే కార్యక్రమాలన్నీ ఈ శాఖ పరిధిలో ఉంచాలంటూ కొన్ని సూచనలు చేసింది. బంధాలను ప్రోత్సహించేందుకు యువతకు ఫస్ట్ డేట్‌కు 5000 రూబెల్స్ ఇవ్వాలని సూచించింది. ఇంటిపనులు, పిల్లలను చూసుకునేందుకు ఉద్యోగం మానేయాలనుకునేవారికి కొంతమొత్తం చెల్లించాలని చెప్పింది. వీటితో పాటు మరి కొన్ని అసాధారణ ప్రతిపాదనలు చేసింది. ఇదిలా ఉంటే.. ఈ జననాల రేటును పెంచడం కోసం మహిళల వ్యక్తిగత వివరాలను అధికారులు సేకరిస్తున్నట్టు పలు కథనాలు పేర్కొన్నాయి. డేటా సేకరణలో భాగంగా ప్రభుత్వ రంగానికి చెందిన మహిళా ఉద్యోగులకు కొన్ని ప్రశ్నలతో కూడిన ఫామ్స్ అందినట్లు తెలిపాయి.

# బొప్పాయి పంట లాభసాటేనా.. ఎకరాకు ఎంత ఖర్చవుతుంది ?



మండలంలోని వివిధ గ్రామాల్లోని రైతులు బొప్పాయి పంటపైన దృష్టి సారిస్తున్నారు. మార్కెట్‌లో బొప్పాయి పండ్లకు మంచి గిరాకీ ఉండటంతో రైతులు ఈ పంట సాగు చేయడం ఇందుకు కారణం. మండలంలోని చౌదరిపల్లి, గడ్డమల్లయ్యగూడ తదితర గ్రామాల్లో రైతులు బొప్పాయి పంటను సాగుచేస్తున్నారు.

ఈ ప్రాంతం పండ్లతోటలకు అనువైనది కావడంతో అదేవిధంగా తక్కువ నీటితో ఎక్కువ లాభాలు పొందవచ్చునని రైతులు కూరగాయల సాగుతోపాటు బొప్పాయి తోటపైదృష్టి పెట్టారు. బొప్పాయి తోట డ్రిప్ పద్ధతిలో సాగు చేస్తూ తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించవచ్చని నిరూపిస్తున్నారు. ప్రయోగాత్మకంగా ఈ సాగు మంచి ఫలితాలు ఇస్తుండటంతో పలువురు రైతులు బొప్పాయి సాగుపై దృష్టి పెట్టారు
. మండలంలోని చౌదర్‌పల్లి గ్రామంలో డ్రిప్‌తో బొప్పాయి పంటను సాగుచేస్తే ఫలితాలు అధికంగా వస్తాయని వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాల మేరకు దీంతో గ్రామానికి చెందిన రైతు కాశమల్ల రాములు 3 ఎకరాల్లో బొప్పాయి సాగును చేపట్టారు. తేవాన్‌రెడ్‌లేడ్ విత్తనాలను నలభై రోజుల పాటు నాటి మొలకలు వచ్చే వరకు రైతులు పలు జాగ్రత్తలు తీసుకుంటారు. బొప్పాయి పంట ఆరు నెలల నుంచే దిగుబడి వస్తుందని అధిక ఆదాయం ఉండటంతో బొప్పాయి పంట సాగుతో ఆర్థిక లాభాలు పొందవచ్చు. ఉద్యాన వనశాఖ అధికారిణి కనకలక్ష్మి అందించిన సలహాలు, సూచనలు..

## బొప్పాయి సాగు విధానం..

బొప్పాయి పంట సాగుకు మిట్టనేలలు అనుకూలం. ఈ నేలలను బాగా దున్నుకొని డ్రిప్ పైపులను అమర్చుకోవాలి. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు వందశాతం సబ్సిడీ ఇవ్వగా, బీసీలకు 90శాతం సబ్సిడీలతో డ్రిప్‌ను అందజేస్తుంది. ప్రతి ఆరు అడుగులకు ఒక అడుగు లోతు గుంత తొవ్వాలి. అందులో ముందుగా ఆవు ఎరువును వేసి వారం పదిరోజులు మగ్గనివ్వాలి. తరువాత అందులో మొక్కలు నాటాలి. నాటిన మూడు రోజులకు నీరు అందించాలి. నాలుగురోజులకోసారి నీటితో మొక్కలను తడిపితే సరిపోతుంది. పిందె దశలో ఒకరోజు తప్పి ఒకరోజు నీరందిస్తే ఆరు నెలల్లో బొప్పాయి పంట దిగుబడి ప్రారంభం అవుతుంది. సంవత్సరం పాటు బొప్పాయి పంట కోతకు వస్తుంది. ప్రతి చెట్టుకు బొప్పాయి పదిరోజులకు ఒక్కసారి రైతు తెంపి మార్కెట్‌కు తరలిస్తారు. మార్కెట్‌లో పెద్దసైజులో ఉన్నబొప్పాయికి మార్కెట్‌లో మంచి ధర పలుకుతుంది.

## బొప్పాయి పంటపై సస్యరక్షణ చర్యలు

మంచాలలో థైవాన్‌హైబ్రీడ్ రకాల బొప్పాయి పంటలను సాగుచేస్తున్నారు. బొప్పాయి సాగులో రైతులు కనీస జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. భూమిని ముప్పైనుంచి నలభైమీటర్ల లోతుకు దున్నాలి. మొక్కకు మొక్కకు మధ్యన 1.8మీటర్ల దూరం వుండేటట్లు గుంతలు తీయాలి. మొక్కనాటే పదిహేను రోజుల ముందు 5కిలోల పశువుల ఎరువు, కిలో వేపపిండి, ఇరవైగ్రాముల అజోస్పిరిల్లం, రెండువందల గ్రాముల ఫోస్ఫోబ్యాక్టీరియా వేసి బాగా కలిపి గుంత నింపుకోవాలి. తేలికపాటి నేలలో బొప్పాయిలో జింక్, బోరాన్‌దాతువు లోపం ఎక్కువ కనిపిస్తుంది. దీని నివారణకు లీటరు నీటికి ఒక గ్రాము బోరాక్స్, రెండు గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపి పిచికారీ చేసుకోవాలి.


మొక్క మొదలు దగ్గర నీరు తగలకుండా, నీరు నిల్వ ఉండకుండా పిల్లపాదులు తయారుచేసి నీరును పారించాలి. మొక్కచుట్టూ నీరు నిల్వ ఉంటే కుల్లిపోయి పంటకు నష్టం వాటిల్లుతుంది. అందుకే మొక్కచుట్టూ నీరు నిల్వ ఉండకుండా రైతులు చూసుకోవాల్సి ఉంటుంది. నవంబర్ నెలలో ఆకులపై గోధుమ వర్ణపు మొక్కలు ఏర్పడి ఆకులు పసుపు రంగుగా మారి రాలిపోతాయి. దీనికి గాను లీటరు నీటికి మాంకోజెబ్ 2.5గ్రాములు పదిహేను రోజుల వ్యవధిలో రెండు దఫాలుగా పంటపై పిచికారీ చేయాలి. బొప్పాయిలో పదిహేను రోజులకోసారి మందులను పిచికారీ చేయాల్సి ఉంటుంది. చెట్లు పూతకు వచ్చే వరకు క్రిమికీటకాల భారీనుంచి కాపాడేందుకు ఫాంటాక్, టాటామిడా, ఎఫ్4, బోరాన్ మందులను పిచికారీ చేయాలి. పంట కాపుకు వచ్చిన తరువాత తోటకు పిండినల్లి, రాకుండా మందులను పిచికారీ చేసుకోవాలి.

### బొప్పాయి పంట సాగుపై ఖర్చులు, ఆదాయం..

ఎకరా నేలను సాగు చేస్తే రెండువేలు ఖర్చవుతుంది. పేడ, ఎరువు పది లోడ్లకు ఇరవై వేల రూపాయల ఖర్చు అవుతుంది. ఎకరాకు పదమూడు వేల మొక్కలు అవసరవుతాయి. ఒక్కొక్క మొక్కకు పది రూపాయల చొప్పున పదమూడువేల రూపాయలు వెచ్చించాల్సి ఉంటుంది. గుంతలు తవ్వడానికి, మొక్కలు నాటడానికి పద మూడువేలు, రెండు నెలలకు ఒకసారి ఎరువులకు ఇరవైవేల రూపాయలు ఖర్చు అవుతుంది. కలుపుతీతకు పదివేలు, మందుకు పదిహేను వేల రూపాయల వరకు ఖర్చు అవుతుందని, అదేవిధంగా డ్రిప్‌తో కలిపి మొత్తం దాదాపు లక్ష రూపాయల వరకు ఖర్చు అవుతుందని చెప్పారు. మొక్కలు నాటిన ఆరు నెలల నుంచే బొప్పాయి పండ్ల దిగుబడి ప్రారంభం అవుతుంది. ప్రతి పదిరోజులకోసారి బొప్పాయి పండ్లను తీసి మార్కెట్‌కు తరలిస్తారు. బొప్పాయి సాగుపై రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఏడాదికి ముప్పై టన్నుల వరకు దిగుబడి వస్తుంది. నగరంలోని కొత్తపేట పండ్ల మార్కెట్‌లో ఒక కిలో బొప్పాయి ధరకు ఇరవైనుంచి ముప్పై రూపాయల వరకు ధర వస్తుందని సంవత్సర కాలం మొత్తం బొప్పాయి పంట రైతులకు లాభాలు తెచ్చిపెడుతుంది.




# తైవాన్ పై చైనా కుట్రలు



స్వతంత్ర ద్వీపదేశమైన తైవాన్‌పై చైనా దాడులకు సిద్ధమవుతున్నట్లు వార్తలు వినబడుతున్నాయి. యుద్ధానికి సిద్ధం కావాలని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ఇటీవల తమ దేశ సైనికులకు పిలుపునిచ్చారు. చైనా వ్యతిరేకిగా పేరొందిన డొనాల్డ్ ట్రంప్ తాజాగా అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో గెలుపొందారు. ఆయన పదవి చేపట్టడానికి ఇంకా నెలకు పైగా రోజులు సమయం ఉంది. ఈలోగా తైవాన్‌పై చైనా దాడులు చేసే అవకాశాలు ఉన్నాయని వార్తలు వినబడుతున్నాయి. ఒకవైపు ఉక్రెయిన్‌తో యుద్ధంలో రష్యాకు సాయంగా ఉత్తర కొరియా సైన్యం బరిలోకి దిగింది. మరోవైపు పశ్చిమాసియాలో హెజ్‌బొల్లా, హమాస్, ఇరాన్‌లతో ఇజ్రాయెల్ భీకర యుద్ధం కొనసాగిస్తోంది. ఇంకోవైపు అగ్రరాజ్యం అమెరికాలో అధ్యక్ష ఎన్నికల ఫలితాల తర్వాత అధికార మార్పిడి ప్రక్రియ జరుగుతోంది. ప్రస్తుతం ప్రపంచ దృష్టి వీటిపై నెలకొనడం వల్ల ఇదే అదునుగా చేసుకొని స్వతంత్ర ద్వీపదేశమైన తైవాన్‌పై చైనా దాడులకు తెగబడుతోంది. చైనా దురహంకార తీరుపై సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నా.. బుద్ధి మారడం లేదు. ఇటీవల పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ రాకెట్ ఫోర్స్‌కు చెందిన బ్రిగేడ్‌ను సందర్శించిన చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ యుద్ధానికి సన్నాహాలను సమగ్రంగా బలోపేతం చేయాలని సైన్యానికి పిలుపునిచ్చినట్లు ఓ వార్తా సంస్థ కథనంలో పేర్కొంది. తమ దళాలు పటిష్ఠమైన పోరాట సామర్థ్యాలను కలిగి ఉండేలా చూడాలని సైనికులు తమ వ్యూహాత్మక పోరాట సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని జిన్‌పింగ్ సూచించారు. భారత్, చైనా మధ్య వాస్తవాధీన రేఖ ఎల్ ఏసి వెంబడి గత నాలుగేళ్లుగా కొనసాగుతున్న ఉద్రిక్తతలకు ముగింపు పలికేలా ఇటీవల ఇరుదేశాల మధ్య కీలక ఒప్పందం జరిగింది. అందుకు అనుగుణంగానే సరిహద్దుల్లో తూర్పు లద్దాఖ్ సెక్టార్‌లోని రెండు కీలక ప్రాంతాలైన డెమ్చోక్, డెస్పాంగ్ నుంచి రెండు దేశాల బలగాల ఉపసంహరణ ప్రక్రియ పూర్తి అయ్యింది. ఇరు దేశాల మధ్య నెలకొన్న మరిన్ని వివాదాలకు భవిష్యత్తులో పరిష్కారం దొరికే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం చైనా తన సరిహద్దు దేశాలను బెదిరించడం లేదు కానీ తమ సైనికులను యుద్ధానికి సిద్ధం చేస్తుండటంపై ఆందోళన నెలకొంది. ఇటీవల తైవాన్ చుట్టూ చైనా పెద్దఎత్తున సైనిక విన్యాసాలు నిర్వహించిన కొద్దిరోజులు తర్వాత ఈ ప్రకటన రావడం పలు అనుమానాలకు దారి తీస్తుంది. తైవాన్‌ను తన భూభాగంగా చెబుతున్న చైనా మిగతా దేశాల దృష్టి తమపై లేనప్పుడే దాడి చేయాలని చూస్తోంది. గతనెల అక్టోబర్‌లో తైవాన్ చుట్టూ 153 చైనా మిలిటరీ విమానాలు చక్కర్లు కొట్టినట్లుగా తైవాన్ రక్షణశాఖ వెల్లడించింది. తైవాన్ స్వతంత్ర దళాల, వేర్పాటువాద చర్యలకు హెచ్చరికగా ఈ భారీ విన్యాసాలను చేపట్టినట్లు చైనా ప్రకటించింది. తైవాన్, ఏ దేశానికీ అధీనం కాదని ఆ దేశ అధ్యక్షుడు లై చింగ్ వ్యాఖ్యలకు హెచ్చరికగా ఈ చర్యలు చేపట్టినట్లు చైనా తెలిపింది. తైవాన్ జాతీయ దినోత్సవం జరిగిన ఐదు రోజుల తర్వాత సైనిక విన్యాసాలు చేపట్టి చైనా గట్టి హెచ్చరికలు పంపింది. చైనా కవ్వింపు చర్యలకు వ్యతిరేకంగా తైవాన్‌కు అండగా అమెరికా మద్దతు ఇస్తోంది. తైవాన్‌పై చైనా, అమెరికా కన్నుపడటానికి ప్రధాన కారణం అక్కడి చిప్స్ పరిశ్రమ. ఫోన్ల నుంచి యుద్ధ విమానాల వరకు వాడే సిలికాన్ చిప్స్ ఉత్పత్తిలో తైవాన్ ప్రధాన పాత్ర పోషిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక సెమీకండక్టర్లను తయారు చేసే సంస్థ, తైవాన్ సెమీకండక్టర్ మ్యానిఫ్యాక్చరింగ్ కంపెనీ టిఎస్ఎంసి తైవాన్‌లోనే ఉంది. ఈ రంగంలో గ్లోబల్ మార్కెట్‌లో దాదాపు 55 శాతం తైవాన్ నుంచే వస్తోంది. అందుకే అమెరికా, చైనాలు తైవాన్‌పై కన్నేశాయి. చైనా, అమెరికా ఎత్తుగడలు తైవాన్ పై ఎలాంటి ప్రభావం చూపుతాయని ప్రపంచమంతా గమనిస్తోంది.

# అవగాహనతోనే అధిక దిగుబడులు



రైతులు సాగు చేస్తున్న వివిధ రకాల పంటల్లో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులను సాధించవచ్చని వ్యవసాయ నిపుణులు సూచించారు. ఎరువులు, పురుగుల మందులను మోతాదుకు మించనీయవద్దని.. అలా చేస్తే లాభం కంటే నష్టమే అధికంగా ఉంటుందని పేర్కొంటున్నారు. ప్రస్తుతం చలి తీవ్రత పెరిగిన నేపథ్యంలో తగు జాగ్రత్తలు చేపట్టాలని సూచిస్తున్నారు.

## కంది చేలల్లో..

వానకాలం పంటగా వేసిన దీర్ఘకాలిక కంది రకాలు ప్రస్తుతం పూత, కాత దశలో ఉన్నాయి. వీటికి శనగపచ్చ పురుగు, మారుకా మచ్చల పురుగు ఎక్కువగా ఆశించి పంటను నాశనం చేస్తాయి. శనగపచ్చ పురుగు నివారణకు తొలిదశలో క్లోరోఫైరిఫాస్ 2.5 మిల్లీలీటర్లు, క్వినాల్‌ఫాస్ 2 మి.లీ లేదా ఎసిఫేట్‌ను 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఈ మందును వాడిన తర్వాత కూడా శనగపచ్చ పురుగు ప్రభావం తగ్గకుంటే ఇండాక్సికార్బ్ 1 మి.లీ లేదా 0.3 మి.లీ స్పైనోసాడ్ లేదా 0.3 మి.లీ క్లోరంత్రనిప్రోల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

మారుకామచ్చల పురుగు నివారణకు..
ఈ పురుగు ఆకులను, పూతను ఒక దగ్గరకు చేర్చి గూడుగా మార్చి పంటకు నష్టం కలిగిస్తుంది. దీని నివారణకు క్లోరోఫైరిఫాస్ 2.5 మి.లీలు, 1 మి.లీ డైక్లోరోవాస్ లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. పురుగు తీవ్రత మరీ ఎక్కువగా ఉంటే థయోడికార్బ్ 1 గ్రాము లేదా స్పైనోసాడ్, ఫ్లూ బెండమైడ్ 0.3 మి.లీల చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

## వేరు శనగ

అక్టోబర్ 15 నుంచి నవంబర్ 15 వరకు వేసిన వేరుశనగ పైరు ప్రస్తుతం పూతదశలో ఉన్నందున చివరిసారిగా అంతరకృషి చేసి హెక్టారుకు 500 కిలోల జిప్సంను 5 సెం.మీల లోతులో మొక్క దగ్గర వేసి మట్టితో ఎగదోయాలి. అనంతరం నీరుపెట్టాలి.

## కుసుమ పంట..

కుసుమ పంటకు విత్తిన 40 నుంచి 45 రోజుల వరకు పేను తాకిడి చాలా ప్రమాదకరమైంది. దీని నివారణకు డై మిథోయేట్ 2 మి.లీలు లేదా మోనోక్రోటోపాస్ 1.6 మి.లీలు లేదా క్లోరోఫైరిఫాస్ 2.5 మి.లీలు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఆల్టర్నేరియా ఆకుమచ్చ తెగులు పంట వేసిన 20 రోజుల నుంచి పూత దశ వరకు ఆశిస్తుంది. దీని నివారణకు మాంకోజెబ్ 2.5 గ్రాములు లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

## మొక్క జొన్న పంటకు..

యాసంగి పంటగా నవంబర్ 15 లోపు విత్తిన మొక్కజొన్న పైరు 30 నుంచి 35 రోజులలోపు వయస్సున్నప్పుడు అంతరకృషి చేసి హెక్టారుకు 75 కిలోల నత్రజనిని ఇచ్చే ఎరువులు వేయాలి. ఎరువులు వేసేటప్పుడు భూమిలో తగిన తేమ ఉండేలా చూసుకోవాలి. 30 నుంచి 40 రోజులున్న పైరుకు అధిక నీరు హానీకరం. కాండం తొలుచు పురుగు, కత్తెర పురుగులు ఎక్కువగా యాసంగి మొక్కజొన్నను ఆశిస్తాయి. పైరు మొలకెత్తిన 20 నుంచి 25 రోజుల నుంచి ఇవి ఎక్కువగా ఆశిస్తాయి. వీటి నివారణకు మోనోక్రోటోపాస్ ఎకరాకు 320 మిల్లీలీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. అవసరాన్ని బట్టి కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఎకరాకు 3 కిలోల చొప్పున పైరు మొలకెత్తిన 25 నుంచి 30 రోజులకు ఆకు సుడులలో వేయాలి.

## శనగ పంటలో..

యాసంగిలో సాగు చేసిన శనగ పంటకు ఈ నెలలో సాధారణంగా పచ్చపురుగు లేదా రబ్బరు పురుగు ఆశించి నష్టం కలిగిస్తుంది. వీటి నివారణకు తొలిదశలో 2.5 మి.లీల క్లోరోఫైరిఫాస్ లేదా 2 మి.లీల క్వినాల్‌ఫాస్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. అవసరమైతే స్పైనోసాడ్ 0.3 మి.లీలు లేదా డై ఫ్యూ బెంజురాన్ 1 మి.లీలు లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో ఒకటి లేదా 2 సార్లు పిచికారీ చేయాలి.

## పొద్దు తిరుగుడు

ఆరుతడి పంటగా నవంబర్‌లో వేయడానికి వీలుగానీ పరిస్థితులలో ఈ నెలలో పొద్దు తిరుగుడును విత్తుకోవచ్చు. హైబ్రిడ్ రకాలను సాగు చేసుకోవడం మంచిది. కేబీఎస్‌హెచ్44, ఎన్‌డీఎస్‌హెచ్ 1, డీఆర్‌ఎస్‌హెచ్ 1, ఏపీఎస్‌హెచ్ 66 రకాలు అనువైనవి. నవంబర్‌లో విత్తిన పైరుకు 30 నుంచి 35 రోజుల్లో హెక్టారుకు 40 కిలోల నత్రజని ఎరువులు వేయాలి.

## డిసెంబర్‌లో గ్రూప్ - 1 అభ్యర్థులకు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు

**మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

**గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3 పోస్టుల భర్తీకి పరీక్షలను నిర్వహించామని, డిసెంబర్ నెలలో వారికి ఉద్యోగాల అపాయింట్‌మెంట్**



**పాలేరు, నవంబర్ 9, మహా:** రైతులు పండించిన ధాన్యం చివరి గింజ వరకు మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. శనివారం మంత్రి కూసుమంచి మండల తహసీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మీ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ వరి పంట సాగు చేసిన రైతులు నిర్భయంగా ఉండాలని, చివరి గింజ వరకు మద్దతు ధరపై ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, అదేవిధంగా సన్న వడ్లకు క్వింటాల్ కు అదనంగా రూ. 500 చెల్లిస్తామన్నారు.

గత ప్రభుత్వాలు రైతుల పట్ల ఎలా వ్యవహరించాయో అందరికీ తెలుసన్నారు. ప్రజా ప్రభుత్వం రైతులు, మహిళలు, పేదల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తుందని అన్నారు. రాష్ట్రానికి ఉన్న అప్పులు తీరుస్తూ, ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ ప్రజాసంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని అన్నారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రెండు లక్షల వరకు రుణాలు ఉన్న రైతులకు 18 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేశామని, మరో 13 వేల కోట్లు మాఫీ చేయాల్సి ఉందని, డిసెంబర్ నెలాఖరు నాటికి పెండింగ్ రుణమాఫీ చేస్తామన్నారు. నిరుద్యోగ యువతకు ప్రజా ప్రభుత్వం వచ్చిన పది నెలల వ్యవధిలో 57 వేల పైగా ఉద్యోగాలను భర్తీ చేశామని, గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3 పోస్టుల భర్తీకి పరీక్షలను నిర్వహించామని, డిసెంబర్ నెలలో వారికి ఉద్యోగాల అపాయింట్మెంట్ ఆర్డర్లు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి మాటను తప్పనిసరిగా అమలు చేస్తామని అన్నారు.

మంత్రి ఈ సందర్భంగా 61 మంది కళ్యాణలక్ష్మి/షాదీముబారక్ లబ్దిదారులకు రూ. 6,10,7076 ల చెక్కులను పంపిణీ చేశారు. కూసుమంచి మండలం నాయకన్ గూడెంలో ఇటీవల వరదల్లో మృతిచెందిన షేక్ యాకుబ్, సైదాబీ దంపతుల కుమారులు షేక్ యూసుఫ్, షేక్ షరీఫ్ లకు కూసుమంచి మండల కేంద్రంలో ఇండ్ల స్థలాల పట్టాలను మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సరిత, ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అపోహలు ఆపండి.. సహకారం ఇవ్వండి

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**ఖమ్మం, నవంబర్ 9, మహా:** సమగ్ర కుటుంబ సర్వే నమోదు ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. శనివారం నుండి ప్రారంభమైన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై సీఎస్ శాంతి కుమారి, ఇతర ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ, మహోన్నత కార్యక్రమంలో భాగస్వాములు అవుతున్నారని జిల్లా కలెక్టర్లను, అధికారులను, ఎన్యూమరేటర్లను అభినందించారు. కలెక్టర్లు ఎన్యూమరేటర్లలతో నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ ప్రక్రియకు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలను ఆహ్వానించాలన్నారు. సర్వే ప్రక్రియపై యావత్తు దేశం మొత్తం తెలంగాణను గమనిస్తున్నదని తెలిపారు. ఇంటింటి సమగ్ర సర్వే నేపథ్యంలో ప్రజలకు అనేక సందేహాలు వస్తుంటాయని, వాటిని నివృత్తి చేస్తూ ముందుకు సాగాలని సూచించారు. ఎలాంటి సందేహాలున్నా ఎన్యూమరేటర్లు కలెక్టర్ల దృష్టికి తేవాలని ఆయన అన్నారు. సర్వేపై ప్రజలతో మమేకం అయితే సందేహాలు ఏమిటో తెలుస్తాయని, వెంటనే నివృత్తి చేయడానికి చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలు ఎలాంటి



అపోహలకు పోకుండా ఎన్యూమరేటర్లు అడిగిన సమాచారం ఇవ్వాలని సూచించారు. సర్వే ప్రక్రియలో ప్రజల పట్ల ఎన్యూమరేటర్లు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. సమగ్ర కుటుంబ సర్వే చాలా మంచి కార్యక్రమమని, ప్రజల సమగ్ర సమాచారం సేకరణ వల్ల అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అందించి, వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేయడానికి దోహదపడతాయని తెలిపారు. హౌస్ లిస్టింగ్ సర్వే దిగ్విజయంగా నిర్వహించారని, అదే ఉత్సాహంతో సర్వే పూర్తి అయ్యేవరకు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. సర్వే ప్రక్రియలో ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ ఎలాంటి ఇబ్బంది లేకుండా ముందుకు తీసుకెళుతున్నారని భాగస్వామ్యం అయిన కలెక్టర్లను, ఎన్యూమరేటర్లు ను, ప్రణాళికా శాఖ అధికారులను డిప్యూటీ సీఎం అభినందించారు. ఎన్యూమరేటర్లకు సర్వే పై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారని, హౌస్ లిస్ట్ కూడా విజయవంతంగా పూర్తి చేశారని అభినందించారు.

దేశంలో జరిగే అతిపెద్ద కార్యక్రమమని, సిబ్బంది నిబద్ధత, అంకితభావంతో సర్వే విజయవంతం చేయాలని అన్నారు. ఈ దేశంలో ప్రగతిశీల భావాలను, కార్యక్రమాలను వ్యాప్తి చేయడానికి ఈ సర్వే ఉపయోగపడుతుందని తెలిపారు. సర్వే సమాచారం గ్రామస్థాయిలోని చిట్ట చివరి ఇంటికి చేరే విధంగా విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని, గ్రామాలు, పట్టణాల ప్రధాన కూడళ్లలో హోర్డింగ్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. కలెక్టర్లతోపాటు అన్ని స్థాయిల లోని అధికారులు సర్వే ప్రక్రియను పరిశీలిస్తూ సిబ్బందికి తగు, సలహాలు సూచనలు ఇవ్వాలని, ప్రధానంగా పట్టణాలపై దృష్టి పెట్టాలని కోరారు. వీడియో కాన్ఫరెన్స్ కు కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి పాల్గొన్న జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో మాట్లాడుతూ, సర్వే కొరకు జారీ చేసిన బుక్ లెట్ లోని మొత్తం అంశాలపై ఎలాంటి అనుమానాలు, సందేహాలకు తావు లేకుండా ప్రజల నుండి ఖచ్చితమైన సమాచారం సేకరణతో నమోదులు చేయాలని సూచించారు. సర్వే ప్రక్రియను సూపర్ వైజర్లు, మండల ప్రత్యేక అధికారులు, నియోజకవర్గ బాధ్యులు సూపర్ చెక్ చేయాలని, నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్వే ప్రక్రియను నిబద్ధతతో నిష్పక్షపాతంగా ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నిర్వహించాలని అన్నారు. ప్రజలు సర్వే సిబ్బందికి సహకరించి సమగ్ర సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎలాంటి అపోహలు లేకుండా ప్రజలు ఖచ్చిత సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సీపీఓ ఎ. శ్రీనివాస్, జెడ్పీ డిప్యూటీ సీఇఓ నాగలక్ష్మి, అదనపు డీఆర్డీవో నూరొద్దీన్, ఖమ్మం డివిజనల్ పంచాయితీ అధికారి రాంబాబు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలి

**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.**

**ములుగు జిల్లా ప్రతినిధి, మహా:** ఏ ఒక్క కుటుంబం కూడా మిస్ కాకుండా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని, సర్వే కోసం ఇండ్లకు వచ్చే ఎన్యూమరేటర్లకు ప్రజలు సహకరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తెలిపారు. నేటి నుండి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభమైన నేపథ్యంలో శనివారం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ జిల్లా కేంద్రంలోని శ్రీనివాస కాలనీ వార్డు నెంబర్.1 లో, ఎస్సీ కాలనీ, ఎక్సైజ్ కార్యాలయం వెనుక వీధిలో పర్యటించి సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేను పర్యవేక్షించారు. మొదటి రోజు కాబట్టి వివరాల సేకరణలో ఏమైనా ఇబ్బందులు కలుగుతున్నాయా? అని ఎనుమరేటర్లను అడిగి తెలుసుకున్నారు. ఇబ్బందులు ఉంటే సూపర్వైజర్లకు, ప్రత్యేక అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్వేలో భాగంగా ఈనెల 8వ తేదీ వరకు ఇంటింటికి స్టిక్కరింగ్ వేయడం పూర్తి చేశామని, శనివారం నుండి ప్రభుత్వం నిర్దేశించిన ఫారంలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ మరియు కుల వివరాలను ప్రతి కుటుంబం నుంచి సేకరించి, నమోదు చేయడం జరుగుతుందని అన్నారు. దాదాపు 57 కు పైగా అంశాల వివరాలను నమోదు చేయవలసి ఉన్నందున ఎన్యూమరేటర్ కు ఒక సహాయకులను నియమించుకుంటే బాగుంటదని సూచించారు. ప్రతి ఒక్క బ్లాక్ కు ఒక ప్రత్యేక ఎన్యూమరేటర్ ఉండేలా జాగ్రత్తగా తీసుకోవాలని అన్నారు. అన్ని స్థాయిల స్పెషల్ ఆఫీసర్లు క్షేత్రస్థాయిలో తిరుగుతూ సర్వేలో ఏమైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఈ సర్వే వలన ప్రభుత్వ పథకాలను మరింత సమర్థ వంతంగా రూపొందించడానికి అవకాశం మెరుగవుతుందని, కాబట్టి ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం తదితర వివరాలను తమ వద్ద ఉంచుకొని సర్వే కోసం వచ్చే ఎన్యూమరేటర్లకు అందించి వివరాలను నమోదు చేయించుకోవాలని ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ వెంట ములుగు తహశీల్దార్ విజయ భాస్కర్, తదితరులు ఉన్నారు.

## గుర్రంపేటలో దారుణం

**మహిళను హత్య చేసిన దుండగులు**



**ములుగు జిల్లా ప్రతినిధి, మహా:** భూపాలపల్లి జిల్లా వెంకటాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గుర్రంపేటలో అదే గ్రామానికి చెందిన సకినాల సరస్వతి (45) శుక్రవారం రాత్రి హత్యకు గురైంది. ఈ సంఘటన శనివారం ఉదయం వెలుగులోకి వచ్చింది. గుర్రంపేట గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు ములుగు సీఐ శంకర్ తోపాటు వెంకటాపూర్ ఎస్ఐ జక్కుల సతీష్ గుర్రంపేటకు చేరుకొని హత్య జరిగిన ప్రదేశాన్ని సందర్శించి సంఘటన తీరును పరిశీలన చేశారు. అంతేకాకుండా క్లూజ్ టీం, డాగ్ స్క్వాడ్ బృందం సైతం హత్య జరిగిన ప్రదేశాన్ని సందర్శించి తమదైన శైలీలో పరిశీలన చేశారు. హత్యకు గురైన సరస్వతి భర్త గతంలోనే మృతి చెందగా, ఆమె గ్రామంలో ఒంటరిగా జీవిస్తుంది. ఈ క్రమంలో సరస్వతి శుక్రవారం అర్ధరాత్రి హత్యకు గురైంది. శనివారం ఉదయం రక్తపు మడుగులో నిర్జీవంగా పడి ఉండటాన్ని గమనించిన గ్రామస్తులు వెంకటాపూర్ పోలీసులకు సమాచారం ఇచ్చారని, మృతురాలి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్టు ఎస్ఐ సతీష్ తెలిపారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని ఆయన పేర్కొన్నారు.

# ఆ డేటాను ఎవరితో పంచుకోవొద్దు

**జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

**ఇల్లందు, నవంబర్ 9, మహా:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి కుటుంబ సర్వేలో ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు పక్కాగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సూచించారు. శుక్రవారం ఇల్లందు మున్సిపల్ పరిధిలోని 11వ వార్డులో జరుగుతున్న సమగ్ర కుటుంబ సర్వే తీరును ఆయన పరిశీలించారు. సర్వేకు సంబంధించిన ఫారంను సక్రమంగా నింపుతున్నారా లేదా అనేది పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్వే చేసిన ప్రతి ఒక్క ఇంటి గోడపై కచ్చితంగా స్టిక్కర్ అంటించాలన్నారు. ప్రతి ఇంటి వద్ద మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ ఓపికతో ప్రతి కుటుంబం నుండి స్పష్టత కలిగిన సమాధానాలను సేకరించాలని, సర్వే జరుగుతున్న సమయంలో కుటుంబ యజమానికి వారి వద్ద నుంచి సేకరించే సమాచారం గోప్యంగా ఉంచబడు



తుందని వారికి అర్థం అయ్యేవిధంగా వివరించాలన్నారు. సర్వే చేసిన షెడ్యూల్ ఫారం జాగ్రత్తగా భద్రపరచాలని, ఆ డేటాను ఇతరులతో ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోకూడదని తెలిపారు. సమగ్ర సర్వే అని ఫోన్ ద్వారా ఎవరికి ఎటువంటి సమాచారం ఇవ్వవద్దని, ప్రభుత్వం నుంచి జరిగే సర్వే ఎట్టి పరిస్థితులను ఫోన్ ద్వారా నిర్వహించవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో సర్వే బృందం అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

## 3 నెలలు అవుతున్నా ఆలస్యం ఎందుకు..? : జిల్లా కలెక్టర్

**ఇల్లందు, నవంబర్ 9, మహా:** ప్రభుత్వ వైద్యశాల మరమ్మత్తు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సూచించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ఇల్లందు ప్రభుత్వ వైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రూ. 65 లక్షల టిజియం ఐడిసి నిధులతో చేపట్టిన ఎలక్ట్రికల్, డ్రైనేజ్, ర్యాక్స్, రూఫ్ లీకేజ్ పనులు జాప్యం చేయకుండా చూడాలని కాంట్రాక్టర్ ను కోరారు. నిధులు మంజూరు చేసి 3 నెలలు కావస్తున్న పనులు ఎందుకు ఆలస్యం అవుతుందని ఆరా తీశారు. అనంతరం వైద్యశాలలో కలియ తిరుగుతూ ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని సంబంధిత వైద్యులను అడిగి తెలు



సుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డా. హర్షవర్ధన్, వైద్యులు డా. బన్సీ, డా. రాంనివాస్, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

# సర్వేకు భారీగా సహకారం



**నేలకొండపల్లి, నవంబర్ 9, మహా:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర సర్వేకు మండల ప్రజలు స్వచ్ఛందంగా సహకరిస్తున్నారు. శనివారం సర్వే లాంఛనంగా ప్రారంభించారు. మండలంలోని 32 గ్రామపంచాయతీలలో 20,270 ఇళ్లును సర్వే చేయనున్నారు. ఇందుకు గాను 139 మంది ఎన్యుమరేటర్స్ సర్వేను ప్రారంభించారు. 13 మంది సూపర్వైజర్స్ ఈ సర్వేను పర్యవేక్షిస్తున్నారు. సర్వేకు తొలి రోజు ఇంటి యాజమానులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వివరాలు అందించారు. తహశీల్దార్ మానిక్స్, ఎంపీడీఓ ఎం. యర్రయ్యలు సర్వే తీరును పరిశీలించారు. నేలకొండపల్లి, అనాసాగారాం, నాచేపల్లి బ్లాక్ సూపర్వైజర్ టి.గురవయ్య ఇంటింటికి వెళ్లి సర్వే ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. ప్రజల యొక్క సామాజిక స్థితిగతులను అంచనా వేయటం కోసం ప్రభుత్వం సర్వే నిర్వహిస్తుందని అన్నారు. సర్వేను బట్టి భవిష్యత్ లో ప్రజల యొక్క అవసరాలను నెరవేర్చుటకు తగిననిధులు కేటాయిస్తుందన్నారు. అందువల్ల ప్రజలు స్వచ్ఛందంగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్యూమరేటర్లు గోపి, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.



## సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన పాయం

**మణుగూరు, నవంబర్ 9, మహా:** లబ్ధిదారులకు మణుగూరు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. శనివారం క్యాంప్ కార్యాలయం ప్రజా భవన్ లో మండలానికి చెందిన 23 మందికి రూ. 9 లక్షలు విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిర్ణకి నవీన్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## సర్వే పత్రంలో వివరాలు సరిగ్గా నింపుతున్నారా.. లేదా ?

**టేకులపల్లి, నవంబర్ 09, మహా:** టేకులపల్లి మండలంలోని సులానగర్ గ్రామంలో సమగ్ర ఇంటింటి సర్వేను శనివారం జిల్లా కలెక్టర్ జితేష్. వి. పాటిల్ పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సర్వేలో విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ అధికారులకు పలు సూచనలు చేశారు. సర్వే చేస్తున్న ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు పక్కాగా నమోదు చేసుకోవాలని, అలాగే సర్వే అయిన ప్రతి ఇంటి గోడపై ఖచ్చితంగా స్టిక్కర్లు అంటించాలని సూచించారు. సర్వే పత్రంలో ఉన్న ప్రశ్నలను సరిగ్గా నింపుతున్నారా లేదా ? అని ఫామ్ ను తీసుకొని కలెక్టర్ పరిశీలించారు. ప్రతి ఇంటిలోని మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ ఓపికతో ప్రతి కుటుంబం నుండి స్పష్టత కలిగిన సమాధానాలను సేకరించాలని, సర్వే జరుగుతున్న సమయంలో కుటుంబ యజమానికి వారి వద్ద నుంచి సేకరించే సమాచారం గోప్యంగా ఉంచబడుతుందని వారికి అర్థం అయ్యే విధంగా తెలియజేయాలని కోరారు. నింపిన షెడ్యూల్ ఫారం



జాగ్రత్తగా భద్రపరచాలని, ఆ డేటాను ఇతరులతో ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోకూడదని తెలిపారు. సమగ్ర సర్వే అని ఫోన్ ద్వారా ఎవరికి ఎటువంటి సమాచారం ఇవ్వద్దన్నారు. ప్రభుత్వం నుంచి జరిగే సర్వే ఎట్టి పరిస్థితులను ఫోన్ ద్వారా సమగ్ర సర్వేను నిర్వహించబోమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో నాగ భవాని, ఎంపీడీవో రవీందర్ రావు, ఎంఈఓ గణేష్ గాంధీ, ఏపీవో శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

## ఓటర్ జాబితా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి



**నేలకొండపల్లి, నవంబర్ 9, మహా:** ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ఓటరు జాబితా ప్రత్యేక కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పాలేరు డివిజన్ ఎన్నికల అధికారి రాజేశ్వరి సూచించారు. శనివారం మండలంలోని సింగారెడ్డిపాలెం, నేలకొండపల్లి పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా ఆమె తనీఖీ చేశారు. బీఎల్వోలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శని, ఆదివారాలలో ప్రత్యేక కార్యక్రమంను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అర్హులైనవారు ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇంటింటి సర్వే తరువాత ప్రకటించిన ముసాయిదా జాబితాలో అభ్యంతరాలు ఉంటే బీఎల్వోలకు తెలియజేయాలన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేసి సవరణలు చేస్తామన్నారు. జనవరి 1, 2025 నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు కొత్తగా ఓటు నమోదు చేసుకోవచ్చునని అన్నారు. ఈ నెల 28 వరకు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులను పరిశీలించి, అర్హత ఉంటే.. తుది జాబితాలో ఓటు వచ్చేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి తహశీల్దార్ జె.మానిప్రవ్, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఆలస్యం మధుసూధనావు, ఆయా గ్రామాల బీఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

## కాలిన బాలుడి ఫొటోతో పోస్టులు పెట్టి రూ. 10 లక్షలు వసూలు

**డబ్బులు అడిగినందుకు ఇంటి నుంచి గెంటివేత**

**గోడు వెల్లబోసుకున్న బాధితులు**

**ఖమ్మం సిటీ, నవంబర్ 9, మహా:** కరెంటు షాక్ తో 70 శాతం కాలిపోయిన శరీరంతో ఉన్న కొడుకును కాపాడుకునేందుకు కన్నీరు మున్నీరవుతూ తల్లిదండ్రులు హుటాహుటిన ఖమ్మం, అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ వెళ్లి రెండు మూడు నెలలుగా ఉన్నదంతా ఖర్చు పెట్టుకుంటూ కొడుకు ప్రాణాలు దక్కించుకునేందుకు చేస్తున్న ప్రయత్నం ఒకటైతే.. చందాల పేరుతో వాళ్ల కొడుకు ఫొటో పెట్టి కొందరు రూ. 10 లక్షల వరకు వసూళ్లు చేసుకున్న వైనం మరొకటి. ఈ విషయం తెలిసి అడిగినందుకు.. దిక్కున్నకాడ చెప్పుకోపో అని కిరాయికి ఉన్న ఇంటిలోనుంచి తమను గెంటివేశారంటూ పెంతల శోభ అనే బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. శనివారం ఖమ్మం ప్రెస్ క్లబ్ లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఖమ్మం రూరల్ మండలం శ్రీసాయి గణేష్ నగర్ లోని రోడ్ నెంబర్ 14 లో శోభ, తన భర్త మధు, ఇద్దరు పిల్లలతో కలసి పోట్ల శ్రీనివాసరావు ఇంట్లో నెలకు రూ. 7 వేల అద్దె చెల్లిస్తూ గత రెండు సంవత్సరాలుగా నివాసం ఉంటూ చిన్నపాటి కిరాణం నడుకుంటున్నారు. ఈ క్రమంలో జులై 4న డాబాపై ఆడుకుంటున్న తమ కుమారుడు భారత్ (9) కు ఇంటి పైన ఉన్న 33/11 కేవీ విద్యుత్ తీగలు తగలడంతో 70




శాతం శరీరం కాలిపోయింది. విగతజీవిగా పడి ఉన్న తమ కుమారుడిని చూసి హుటాహుటిన ఖమ్మం ఆస్పత్రికి, అక్కడినుండి మెరుగైన వైద్యం కోసం హైదరాబాదుకు తీసుకువెళ్లి సుమారు పది లక్షల రూపాయలు ఖర్చు పెట్టినప్పటికీ ప్రాణం దక్కింది కానీ, సగం కాలిపోయిన ఎడమ కాలు తీసేశారని, కుడికాలుకు కూడా శస్త్ర చికిత్స చేస్తే నడవలేని స్థితిలో ఉన్నాడంటూ కన్నీరుమున్నీరయ్యింది. శస్త్ర చికిత్స కోసం డబ్బుల ఎన్నో ఇబ్బందులు పడుతున్నామంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. అయితే, సాయిగణేష్ నగర్ లో తాము కిరాయికుంటున్న ఇంటి యజమాని పోట్ల శ్రీనివాసరావు, నరేందర్ రెడ్డి, రమేష్, ప్రసాద్ లు తమ కుమారుడి ఫొటో పెట్టి కరెంట్ షాక్ తగిలిన బాబుకు దాతలు సహాయం చేయాలంటూ గ్రూపుల్లో పోస్టు పెట్టి సుమారు రూ. 10 లక్షల వరకు వసూళ్లు చేశారని ఆరోపించింది.

# సర్వేతో చేయూత



**ఏటూరు నాగారం, నవంబర్ 9, మహా :** సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేతో ఆర్థికంగా వెనకబడిన వారికి చేయూతనిస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రఘు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ప్రధాన లక్ష్యం అని అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జరుగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ మరియు కుల సర్వేలో కాంగ్రెస్ శ్రేణులు తప్పకుండా పాల్గొని అధికారులతో సహాయక చర్యలు అందించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కులగణనతో ఆర్థికంగా వెనుకబడిన వారికి చేయూత అందించాలని ధృడ సంకల్పంతో ప్రభుత్వం ఈ సర్వే చేస్తుందన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు రుణమాఫీ, 500 రూపాయలకే గ్యాస్, రూ. 10 లక్షల వరకు ఆరోగ్య శ్రీ, 200 యూనిట్ల కరెంట్ బిల్, ఇందిరమ్మ ఇండ్లు, ప్రభుత్వం విద్యార్థులకు డైట్ ఛార్జ్ లు పెంచిన విషయం ప్రజల్లోకి తీసుకెళ్లాలని మండల కాంగ్రెస్ నాయకులను కోరారు. ఈ కార్యక్రమంలో శివాలయం కమిటీ చైర్మన్ మాడుగురి ప్రసాద్, టౌన్ బీసీ సెల్ అధ్యక్షులు వలస తిరుపతి, టౌన్ బీసీ సెల్ ఉపాధ్యక్షులు ఈరవేణి రాంలాల్, జిల్లా, మండల, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఫారమ్ వెనుక భాగాన యజమాని సంతకం తీసుకోవాలి



మధిర, నవంబర్ 9, మహా: మండలంలో సమగ్ర సర్వే ప్రారంభించినట్లు స్పెషల్ ఆఫీసర్ నరసింహారావు తెలిపారు. శనివారం తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైన సమగ్ర కుటుంబ సర్వేలో మధిర మున్సిపాలిటీలో 10,038 కుటుంబాలు, మధిర రూరల్ ఏరియాలో 14,248 కుటుంబాలు ఉన్నట్లు, మధిర మున్సిపాలిటీలో 86 మంది ఎన్యూమరేటర్లు, రూరల్ ఏరియాలో 12 మంది ఎన్యూమరేటర్లకు టీములుగా పనిచేస్తున్నారని అధికారులు తెలిపారు. తెలంగాణలో ఏ ప్రాంతంలో ఉన్న సర్వేలు వివరాలు తెలపవచ్చని సర్వే అధికారులు వచ్చినప్పుడు వారు నివాసం ఉంటున్న సొంత ఊరు వివరాలు తెలపవచ్చని అన్నారు. ఒక్కొక్క ఎన్యూమరేటర్లకు రోజుకు 15 కుటుంబ వివరాలు సేకరించేలా వారికి ఖమ్మంలో ట్రైనింగ్ ఇచ్చామన్నారు. ప్రతి ఎన్యూమరేటర్ల నమోదు చేసిన ఫారమ్ ను సూపర్ వైజర్ చెక్ చేస్తారని, మరుసటి రోజు డేటాను మునిసిపల్ ఆఫీసు, స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆన్లైన్ లో నమోదు చేస్తారని చెప్పారు. సర్వేలో భాగంగా ఇంటింటికి వెళ్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులకు చేదు అనుభవాలు ఎదురవకుండా క్షుణ్ణంగా వివరాలు అడిగి తీసుకొని ఫారమ్ వెనుక భాగాన యజమాని సంతకం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సంపత్ కుమార్, తహశీల్దార్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# సర్వేను పరిశీలించిన ఆర్డీఓ



**ముదిగొండ, నవంబర్ 9, మహా :** మండలంలోని 25 గ్రామపంచాయతీలలో సమగ్ర కుటుంబ సర్వేను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కె. సునీత ఎలిజిబెత్ మాట్లాడుతూ ఇంటింటి సర్వేను పక్కాగా నిర్వహించనున్నట్లు తెలిపారు. సర్వేలో 8 పేజీలతో 75 అంశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈనెల 21 వరకు సర్వే కొనసాగనున్నదని చెప్పారు. మండల కేంద్రమైన ముదిగొండ గ్రామపంచాయతీ శివారు రాఘవాపురంలో శనివారం జరిగిన కుటుంబ సమగ్ర సర్వేను ఆర్డీఓ గరిడి నరసింహారావు క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేను జాగ్రత్తగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. తప్పులు దొర్లకుండా కులగణనను చేయాలని ఆర్డీఓ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు ఎస్కే వహీదాబేగం, ప్రసన్నకుమార్, ముదిగొండ పంచాయతీ సెక్రెటరీ సీహెచ్ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

# ఇది చాలా మంచి పని

## - వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రీ




**బోనకల్, నవంబర్ 9, మహా:** పరిసరాల పరిశుభ్రతకు, సామాజిక బాధ్యతకు అనుసంధానంగా, గ్రామాల పరిశుభ్రతే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు బీపీ నాయక్ ప్రతిష్టాత్మకంగా రూపొందించిన కార్యక్రమం మన ఊరు మన బాధ్యత రెండవ శనివారంకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలకు పూర్వ వైభవం తీసుకురావడమే ధ్యేయంగా మొదలుపెట్టిన ఈ కార్యక్రమం మహా యజ్ఞముల కొనసాగుతుందని, ఎన్ని అడ్డంకులు వచ్చినా, ఎవరు అడ్డు వచ్చినా ఈ బృహత్కర కార్యక్రమం ఆగదని, గ్రామాలకు పునర్జీవనం తీసుకొచ్చే ఆశయాన్ని ఆపలేరని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా ఈరోజు స్థానిక ఎస్సీ కాలనీ వీధుల నుండి గ్రామ బొడ్రాయి వరకు పరిశుభ్రత కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ కార్యక్రమం పిలుపు మేరకు ఎంతోమంది గ్రామ పెద్దలు, మహిళలు, చిన్నారులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కదం కదం తొక్కి వీధులను పరిశుభ్రం చేయడంలో సహాయ సహకారాలు అందించారు. ఈ మార్పు చాలా ఆనందాన్నిచ్చిందని తెలియజేశారు. కార్యక్రమం కొనసాగుతుండగా మండలం పంచాయతీ అధికారి వ్యాకరణ వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రీ వచ్చి కార్యక్రమానికి సంఘీభావం తెలిపారు, ఇది చాలా మంచి పని అని, వందల మందికి స్ఫూర్తినిస్తుందని కితాభించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దాసరి శ్రీను, అన్నెపాక అరుణ్,అన్నెపాక ప్రసాద్, అంతోటి శ్రీను, బాబు, అచ్యుత్ పవన్, అంతోటి చంద్రం, శ్రీను, రాముడు, అనిల్, గోపి, సూరి, పుల్లయ్య, వెంకటేశ్వర్లు, పాపగంటి వెంకటరత్నం, అన్నపాక సుధారాణి, మంగమ్మ,అన్నెపాక ఏడుకొండలు, రమేష్‌నాయక్, గోపి, తరుణ్, హుస్సేన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# గురుకులానికి విద్యార్థులచే రంగులు

- పుస్తకాలు పట్టుకునే చేతులతో బ్రష్ లు పట్టిస్తున్న వైనం
- ప్రత్యామ్నాయం లేక చెప్పిన పనులు చేస్తున్న విద్యార్థులు




**ఇల్లందు, నవంబర్ 9, మహా :** మైనార్టీ విద్యార్థులకు నాణ్యతతో కూడిన విద్య అందించి వారిని విద్యావంతులను చేసి వెనుకబాటు తనం నుంచి ఉన్నత స్థాయికి చేర్చాలనే తెలంగాణ ప్రభుత్వ ఆశయం నీరుగారే ప్రమాదం లేకపోలేదు. ప్రభుత్వ లక్ష్యానికి భిన్నంగా ఇల్లందు మైనార్టీ గురుకుల పాఠశాలలలో విద్యార్థులకు చదువొద్దు... చాకిరే ముద్దు అనేలా నిర్వాహకులు వ్యవహారిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. విద్యాబుద్ధులు నేర్పిస్తారని గంపెడాశలతో తమ పిల్లలను గురుకులాలలో చేర్పిస్తే మైనార్టీ డే ఉందని ఏకంగా చిన్నారులచే రంగులు వేస్తున్నట్లు కండ్లకు కనిపిస్తుంది. ఇలా మైనారిటీ గురుకుల పాఠశాలలో సిబ్బంది బాధ్యత రాహిత్యం వల్లనే విద్యార్థులచే వెట్టిచాకిరి చేస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు. ఈనెల 11న మైనార్టీ డే ఉండడం వల్ల వేడుకలు జరిగే క్రమంలో పెన్ను పట్టుకుని వారు భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాల్సిన విద్యార్థుల చేతులతో బ్రష్‌లు పట్టించి సున్నం వేయించడం ఏమిటని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాము గురుకుల పాఠశాలలో పనులు చేయడానికి రాలేదని, చదువుకొని



ఉన్నత స్థాయికి చేరేందుకు వచ్చామని చెప్పే ధైర్యం లేక ప్రత్యామ్నాయం లేకపోవడంతో వారు చెప్పిన పనులు చేయాల్సిన పరిస్థితి నెలకొందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా కాంట్రాక్ట్ ద్వారా మైనారిటీ గురుకుల పాఠశాలకు సున్నం, రంగులు వేయించే అవకాశం ఉంటుంది. కానీ అలా కాకుండా విద్యార్థులతో ఆ పనులు చేయించడం ఏమిటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇలా విద్యార్థులతో పనులు చేయిస్తున్న నిర్వాహకులపై జిల్లా అధికారులు దృష్టి సారించి, ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పలువురు తల్లిదండ్రులు కోరుతున్నారు.

# చెత్తబండి వివరాలు ఆరా..

- ఖమ్మం పారిశుద్ధ్యంపై కలెక్టర్ నజర్



**ఖమ్మం, నవంబర్ 9, మహా :** ఇంటికి చెత్త బండి సక్రమంగా వస్తుందా, చెత్త సేకరణ సజావుగా జరుగుతుందా, ఇంటి నుంచి తడి, పొడి చెత్త విడివిడిగా ఇస్తున్నారా? అని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ జూబ్లీపురా, సారథినగర్ ప్రాంతంలో తిరిగి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. శనివారం ఉదయం ఖమ్మం నగరంలోని జూబ్లీపురా, సారథినగర్ ప్రాంతాలలో చెత్త సేకరణ పనులను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోజువారి పనులలో నిమగ్నమైన మున్సిపల్ కార్మికులతో కలెక్టర్ ముచ్చటించారు. పారిశుద్ధ్య సిబ్బంది పూర్తి స్థాయిలో విధులకు హాజరవుతున్నారా?, ఎంతమంది సిబ్బంది గైర్హాజరయ్యారు వంటి వివరాలను కలెక్టర్ ఆరా తీశారు. మురికి కాల్వలు శుభ్రం చేస్తున్నారా?, అవసరమైన జాగ్రత్తలు పాటిస్తున్నారా? వంటి వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పారిశుద్ధ్య సిబ్బందికి అవసరమైన పరికరాలు అందిస్తామని, పారిశుద్ధ్య కార్మికుల హెల్త్ ప్రొఫైల్ రూపకల్పనకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నగర కార్పొరేషన్ లో పారిశుద్ధ్య కార్మికుల నుంచి, పై స్థాయి వరకు ప్రతి ఒక్కరూ ప్రణాళిక ప్రకారం పని చేస్తేనే నగర పారిశుద్ధ్య నిర్వహణ మెరుగవుతుందని అన్నారు. నగర కార్పొరేషన్ లో కేటాయించిన పారిశుద్ధ్య సిబ్బంది క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించాలని, పారిశుద్ధ్య సిబ్బంది హాజరు పక్కగా పర్యవేక్షించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కూడలిలో కొన్ని ప్రదేశాలలో ప్రజలు చెత్త బయట వేస్తున్నారని, అలాంటి ప్రదేశంలో చెత్త వేయకుండా ప్రజలలో అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఖాళీ స్థలాల్లో చెత్త పేరుకుపోవడం, చెత్త వేయడం వల్ల దోమలు, కోతులతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, స్పందించిన కలెక్టర్ ఖాళీ ప్లాట్ లను యజమానులు శుభ్రం చేయకుంటే వెంటనే ప్రభుత్వ స్థలంగా బోర్డులు పెట్టాలని ఆదేశించారు. విద్య, వైద్య వ్యవస్థలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం పటిష్ఠ చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఖమ్మం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులతో అత్యుత్తమ బోధన చేపడుతున్నట్లు, అనుభవం, నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నారని, పిల్లలకు అవసరమైన వసతులు సమకూర్చామని సూచించారు. ప్రభుత్వ బడులపై నమ్మకం పెంచుకోవాలని కలెక్టర్ ప్రజలను కోరారు. జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య సేవలు కల్పిస్తున్నామని, మందులు ఉచితంగా అందిస్తున్నామని, మందుల లభ్యత, స్టాక్ వివరాలు బోర్డులో తెలిసే విధంగా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న విద్య, వైద్య సౌకర్యాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ప్రైవేటు ఆసుపత్రులకు ధీటుగా మెరుగైన సేవలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో లభిస్తాయని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సర్వేతో ప్రభుత్వ పథకాలు కట్ కావు

- ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



**ఖమ్మం, నవంబర్ 9, మహా :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ఖమ్మం జిల్లాలో విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ ఖమ్మం నగరంలోని సారథి నగర్ లో ఎన్యూమరేటర్లు, అధికారులతో కలిసి ఇంటింటికి తిరుగుతూ జరుగుతున్న ఇంటింటి సర్వే ప్రక్రియలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను అధికారులు విజయవంతంగా నిర్వహించాలని అన్నారు. సర్వే జరిగే సమయం సంబంధిత ప్రజలకు ముందుగానే తెలిసేలా ప్రచారం చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. సర్వేను సకాలంలో ప్రారంభించాలని, ప్రతి కుటుంబం దగ్గర సంపూర్ణంగా వివరాలను ఎటువంటి పొరపాట్లు లేకుండా సేకరించాలని, ప్రజల నుంచి సేకరించిన వివరాలను ఎప్పటికప్పుడు తప్పులు లేకుండా ఆన్ లైన్ లో నమోదు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. సర్వే పట్ల ప్రజలకు ఉన్న అపోహలను తొలగిస్తూ అవగాహన కల్పించాలని, ఈ సర్వే కారణంగా ఎటువంటి ప్రభుత్వ పథకాలు కట్ కావని ప్రజలకు తెలియజేయాలని, సర్వే సంబంధిత వివరాలు సక్రమంగా నమోదు చేయాలని ప్రజలు ఈ సర్వేలో పాల్గొనడానికి ప్రోత్సహిస్తూ అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. సర్వేలో ప్రతి కుటుంబం పాల్గొనాలని ఏ ఒక్క ఇంటిని వదలకుండా పకడ్బందీగా సర్వే నిర్వహించాలని, సర్వే సమయంలో ఎటువంటి సమస్య తలెత్తినా వెంటనే పై అధికారులకు ఎన్యూమరేటర్లు తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ డిప్యూటీ సీఇఓ నాగలక్ష్మి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అమరులను స్మరించుకుందాం... హక్కులను కాపాడుకుందాం : న్యూడెమోక్రసీ





**గుండాల, నవంబరు 09, మహా:** భూమి కోసం.. ముక్తి కోసం.. ఈ దేశ విముక్తి కోసం అనేకమంది అమరులు తమ అమూల్యమైన ప్రాణాలను అర్పించారని, వారి ఆశయ సాధనలో ప్రజాస్వామ్య హక్కులను కాపాడుకోవడం కోసం ప్రజలంతా ఉద్యమించాలని న్యూడెమోక్రసీ నేతలు చలపతిరావు, సాదినేని వెంకటేశ్వర్లు, ఆవునూరి మధు అన్నారు. అమరవీరుల వారోత్సవాల సందర్భంగా గుండాల మండలం కాచనాపల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొని ప్రసంగించారు. సబ్ డివిజన్ నాయకులు పోనెం రంగయ్య అధ్యక్షతన జరిగిన సభలో వారు మాట్లాడుతూ న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో అనేక ప్రజా ఉద్యమాల ద్వారా పలు సమస్యలను పరిష్కరించుకోవడం జరిగిందని, ఈ పోరాటంలో అనేకమంది నాయకులు తమ అమూల్యమైన ప్రాణాలను అర్పించారని, వారి త్యాగాలను గుర్తు చేసుకుంటూ వారి ఆశయ సాధనలో భాగంగా ప్రజలంతా ఉద్యమించాలన్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలో వేల ఎకరాల భూమిని న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో సాధించుకోవడం జరిగిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా అనేక ప్రజా పోరాటాలను నిర్వహిస్తూ ప్రభుత్వ ద్వంద వైఖరిని ఎప్పటికప్పుడు ఖండిస్తూ అనునిత్యం ప్రజల మధ్య ప్రజల కోసం న్యూడెమోక్రసీ పనిచేస్తుందన్నారు. ముందుగా కాచనపల్లి గ్రామంలో ర్యాలీ నిర్వహించి కళారూపాలచే కోలాటం, డాన్సులు నిర్వహించారు. జెండాను ఆ పార్టీ నాయకులు కారం సీతారాములు ఎగరవేశారు. అనంతరం సంధ్య, ముక్తి సత్యం, జె సీతారామయ్య, గౌని నాగేశ్వరరావు, తుపాకుల నాగేశ్వరరావు పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు వెంకన్న, గడ్డం లాలయ్య, రవి, నరేష్, సారంగపాణి, గోపాల్ కృష్ణ, తోడేటి నాగేశ్వరరావు, అట్టికం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# పత్తి కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా ప్రత్యేక అధికారి



**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, నవంబర్ 09, మహా :** సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే పత్తిని విక్రయించాలని జిల్లా ప్రత్యేక అధికారి సురేంద్ర మోహన్ ఐఏఎస్ అన్నారు. శనివారం సుజాత నగర్ మండలంలోని దేగలమడుగు గ్రామంలో ఉన్న జిన్నింగ్ మిల్లులో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని జిల్లా ప్రత్యేక అధికారి సురేంద్రమోహన్ ఐఏఎస్, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తో కలిసి తనిఖీ చేశారు. కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన నిల్వ ఉన్నపత్తిలో తేమశాతాన్ని స్వయంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం రైతులు వద్ద పత్తి కొనుగోలు చేయాలన్నారు. సీసీఐ ప్రమాణాలకు అనుగుణంగా తేమ శాతం 8 నుండి 12 మధ్యలో ఉండేవిధంగా మార్కెట్ కు తీసుకొచ్చేలా రైతులకు సూచించాలని మార్కెటింగ్ అధికారులను ఆదేశించారు. మిల్లులోనికి పత్తి ప్రవేశం మొదలు తేమశాతం పరీక్ష పరిశీలన, తూకం, విక్రయం ధర, రైతుల వేలిముద్రలతో కూడిన ఆధార్ అనుసంధానం, ఓటీపీ విధానం తదితర అన్ని విషయాల్లో వంటి అవకతవకలకు తావు లేకుండా కొనుగోలు ప్రక్రియ జరగాలని అధికారులన్నారు. రైతులకు ఎన్ని రోజుల్లో ఖాతాల్లో డబ్బు జమా అవుతున్నదని అధికారులను అడిగి తెలుసుకున్నారు. వాట్సాప్ చాట్ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను రెండు పని దినాల్లో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ఎమ్మెస్పీ ప్రకారం క్వింటాకు 7521 రూపాయలు రైతులకు చెల్లించాలన్నారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా, సీసీఐ కేంద్రాలలోనే విక్రయించి మద్దతు ధర పొందాలని ఆయన సూచించారు. కొనుగోలు కేంద్రాలలో రైతులు ఎక్కువసేపు వేచి ఉండాల్సిన అవసరం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పత్తి కొనుగోళ్ల విషయంలో ఎలాంటి ఆలస్యం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి కొనుగోలు కేంద్రంలో సీసీఐ అధికారులు అందుబాటులో ఉండాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, పౌరసరఫరాల అధికారి త్రినాథ్ బాబు, జిల్లా మార్కెటింగ్ అధికారి నరేందర్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం



**ములుగు జిల్లా ప్రతినిధి, నవంబర్ 9, మహా :** 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ నూతన ఓటరు నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం 2025లో భాగంగా 01012025 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ నూతన ఓటర్లుగా నమోదు చేసుకోవాలన్నారు. అదేవిధంగా ఆదివారం కూడా ప్రత్యేక క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ప్రత్యేక క్యాంపుల్లో నూతన ఓటరు నమోదుకు, ఓటరు జాబితాలో మార్పులు చేర్పులు సరి చేయుట మరియు మరణించిన వ్యక్తుల వివరాలు తొలగించడంతోపాటు ఈ ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి నివాసం మారిన ప్రతి ఓటరూ జాబితాలో మార్పునకు దరఖాస్తు చేసుకోవడానికి ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో బూత్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని ఆయన పేర్కొన్నారు.

## ఉప ముఖ్యమంత్రికి వినతి పత్రం



**బోనకల్, నవంబర్ 9, మహా :** మండల పరిధిలోని రాపల్లి గ్రామ అంబేద్కర్ నగర్ నందు ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మించాలని, దానితోపాటు గ్రామ స్మశానవాటికకు నిధులు మంజూరు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను రాపల్లి మాజీ సర్పంచ్ మందాడపు తిరుమలరావు విజ్ఞప్తి చేశారు. ఇందుకు సంబంధించి డిప్యూటీ సీఎంకు ఎంటీఆర్ యూత్ కన్వీనర్, గ్రామ కాంగ్రెస్ నాయకులు చింతపట్ల నరేష్ వినతిపత్రం అందజేశారు. ఉప ముఖ్యమంత్రి విక్రమార్క స్పందిస్తూ గ్రామానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంటీఆర్ యూత్ సభ్యులు అబ్బులు, పవన్, తరుణ్, రాకేష్, చంటి, అనిల్, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## ములుగులో హైకోర్టు న్యాయమూర్తి పర్యటన



**ములుగు జిల్లా ప్రతినిధి, నవంబర్ 9, మహా:** జాతీయ న్యాయ సేవల దినోత్సవం వేడుకల్లో పాల్గొనేందుకు తెలంగాణ రాష్ట్ర న్యాయమూర్తి అలిశెట్టి లక్ష్మీ నారాయణ శనివారం ములుగు జిల్లాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తిని కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరిష్ లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ములుగులోని గట్టమ్మ తల్లిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఎస్పీ ఆదేశాల మేరకు న్యాయమూర్తి పర్యటన సందర్భంగా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ శాఖ తరపున ములుగు డీఎస్పీ రవీందర్, సీఐ ములుగు శంకర్, ములుగు ఎస్ఐ వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్సీ కాలనీలో జిల్లా కలెక్టర్ పర్యటన



**ములుగు జిల్లా ప్రతినిధి, నవంబర్ 9, మహా:** ఏ ఒక్క కుటుంబం కూడా మిస్ కాకుండా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని, సర్వే కోసం ఇండ్లకు వచ్చే ఎన్యూమరేటర్లకు ప్రజలు సహకరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. కోరారు. శనివారం నుంచి సర్వే ప్రారంభమైన నేపథ్యంలో జిల్లా కేంద్రం లోనీ శ్రీనివాస కాలనీ వార్డు నెంబర్.1 లో, ఎస్సీ కాలనీ, ఎక్సైజ్ కార్యాలయం వెనుక వీధిలో ఆయన పర్యటించి సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేను పర్యవేక్షించారు. మొదటిరోజు కాబట్టి వివరాల సేకరణలో ఏమైనా ఇబ్బందులు కలుగుతున్నాయా అని ఎన్యూమరేటర్లను అడిగి తెలుసుకున్నారు. ఇబ్బందులు ఉంటే సూపర్వైజర్లకు, ప్రత్యేక అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్వేలో భాగంగా ఈనెల 8వ తేదీ వరకు ఇంటింటికి స్టిక్కరింగ్ వేయడం పూర్తి చేశామని, శనివారం నుండి ప్రభుత్వం నిర్దేశించిన ఫారంలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ మరియు కుల వివరాలను ప్రతి కుటుంబం నుంచి సేకరించి నమోదు చేయడం జరుగుతుందని అన్నారు. దాదాపు 57 కు పైగా అంశాల వివరాలను నమోదు చేయవలసి ఉన్నందున ఎన్యూమరేటర్ కు ఒక సహాయకులను నియమించుకోవాలని సూచించారు. ప్రతి ఒక్క బ్లాక్ కు ఒక ప్రత్యేక ఎన్యూమరేటర్ ఉండేలా జాగ్రత్తగా తీసుకోవాలన్నారు. అన్ని స్థాయిల స్పెషల్ ఆఫీసర్లు క్షేత్రస్థాయిలో తిరుగుతూ సర్వేలో ఏమైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సర్వే వలన ప్రభుత్వ పథకాలను మరింత సమర్థవంతంగా రూపొందించడానికి అవకాశం మెరుగవుతుందని, కాబట్టి ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం తదితర వివరాలను తమ వద్ద ఉంచుకొని సర్వే కోసం వచ్చే ఎన్యూమరేటర్లకు అందించి వివరాలను నమోదు చేయించుకోవాలని ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ వెంట ములుగు తహసీల్దార్ విజయ భాస్కర్, తదితరులు ఉన్నారు.

# రేగా ప్లాన్ షురూ...

- పట్టు చేజారకుండా ప్రత్యేక వ్యూహాలు
- స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రత్యేక దృష్టి
- పార్టీని పటిష్టం చేసే దిశగా అడుగులు

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, నవంబర్ 9, మహా:** జిల్లా గులాబీ దళపతి, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈ ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ ఓటు బ్యాంకును పదిలం చేసుకునే వ్యూహాలను రచిస్తున్నారు. గత అసెంబ్లీ ఫలితాల్లో కాంగ్రెస్ బీఆర్ఎస్ ఓట్లను ఎలాగైతే కొల్లగొట్టిందో.. ప్రస్తుతం జరగబోయే లోకల్ బాడీ ఎన్నికల్లో అత్యధిక స్థానాలను కైవసం చేసుకోవాలని, జిల్లాలో బీఆర్ఎస్ పార్టీకి తిరుగులేని విజయాన్ని అందించాలని ఆయన భావిస్తున్నారు. ఇందులో భాగంగానే లోకల్ బాడీ ఎన్నికలలో తన ప్లాన్ ను షురూ చేశారు. అందుకు అనుగుణంగా గ్రామ, పట్టణ, మండల, నియోజకవర్గ స్థాయిలో పార్టీ నూతన కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. పార్టీ బలోపేతం చేయడంతోపాటు అనుబంధ సంఘాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే మండల, పట్టణ కమిటీల ఏర్పాటును పూర్తి చేసిన ఆయన మండల నియోజకవర్గాల వారీగా సమావేశాల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. అందుకు త్వరలో తేదీలను ఖరారు చేయనున్నట్టు తెలుస్తుంది. ఆయా సమావేశాలకు ముఖ్య నాయకులంతా హాజరయ్యేలా చూడడంతో పాటు పార్టీ విధి విధానాలను కార్యకర్తలకు దిశా నిర్దేశం చేసేలా ఎజెండాను సైతం రూపొందిస్తున్నారు. స్థానిక సంస్థల ఫలితాల్లో బీఆర్ఎస్ మార్క్ చూపేందుకు కసరత్తును ఇప్పటికే ప్రారంభించారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు, డిక్లరేషన్‌లు, కులగణన, బీసీ సబ్ ప్లాన్, 42 శాతం బీసీల రిజర్వేషన్ల అంశాలను అస్త్రంగా చేసుకుని ప్రజల్లోకి వెళ్లి ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో అమలుకాని హామీలను వివరించి కాంగ్రెస్ ఓట్లను చీల్చాలని జిల్లా గులాబీ దళపతి భావిస్తున్నారు. ఈ విషయమై ఇప్పటికే నాయకులకు దిశా నిర్దేశం చేశారు. పార్టీలోని అసంతృప్తి నాయకులకు భవిష్యత్ భరోసా కల్పిస్తూ తన మార్క్ రాజకీయాల పై దృష్టి పెట్టారు.

**చాప కింద నీరులా ఎన్నికలకు రంగం సిద్ధం**

స్థానిక ఎన్నికలను రాష్ట్ర ప్రభుత్వం దశలవారీగా నిర్వహించబోతుందన్న సమాచారంతో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) చాప కింద నీరులా ఎన్నికలకు రంగం సిద్ధం చేస్తున్నారు. బీఆర్ఎస్ పూర్వ వైభవం కోసం ప్రణాళిక అమలు చేస్తున్నారు. ఎంపీటీసీ ప్రాదేశిక ఎన్నికలతోపాటు స్థానిక ఎన్నికలైన మున్సిపల్, సర్పంచ్ ఎన్నికల్లో పక్కాప్లాన్ తో అంతర్గత కసరత్తును ముమ్మరం చేసినట్లు తెలుస్తుంది. ఈ ఎన్నికల్లో తన సత్తా చాటాలని ప్రయత్నిస్తున్నారు. త్వరలో జరిగే ఈ ఎన్నికలకు తనదైన శైలిలో ఇప్పటి నుంచే ప్రణాళికలు రచించడం గమనార్హం. ఖర్చుకు వెనుకాడకుండా అభ్యర్థులను ఏదో రూపకంగా గెలిపించుకునే స్కెచ్ వేసినట్టు సమాచారం. ప్రభుత్వం రిజర్వేషన్లను ఎలా కేటాయించినా వెనకడుగు వేయకుండా ఆ రిజర్వేషన్లకు తగ్గట్టు ఎవరెవరు బరిలో నిలబడితే బాగుంటుందో అనేదానిపై క్షేత్రస్థాయిలో అమలు చేసేందుకు జిల్లా పార్టీ అధ్యక్షుడు రేగా కాంతారావు గ్రామాలలో పర్యటించి, పలువురు నాయకులు కార్యకర్తలతో మాట్లాడుతున్నట్టు సమాచారం. రుణమాఫీ, సంక్షేమ పథకాలు కాంగ్రెస్ పార్టీకి గ్రామాల్లో కలిసి వస్తుందని భావిస్తున్న కాంగ్రెస్ ఎత్తుకు బీఆర్ఎస్ పై ఎత్తు వేయాలని ప్రయత్నిస్తున్నారు. వినూత్న ఆలోచనతో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ఇప్పటి నుంచే పావులు కదుపుతున్నారు.

## పార్టీ శ్రేణులను సమాయత్తం చేసేందుకు ప్రణాళికలు

స్థానిక ఎన్నికలకు గ్రామస్థాయి నుంచి పార్టీ శ్రేణులను సమాయత్తం చేసేందుకు జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు కాంతారావు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. జిల్లా వారీగా పార్టీ పరిస్థితులను సమీక్షించి అన్ని మండలాల్లో పూర్తి స్థాయి పట్టు సాధించేందుకు వ్యూహాలను సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తుంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉత్సాహంతో పనిచేసినప్పటికీ పార్టీ అధికారం కోల్పోయిన నేపథ్యంలో కేడర్ ఏమాత్రం నిరుత్సాహ పడకుండా స్థానిక సమరంలో ఉత్సాహం పనిచేసేలా పార్టీ నాయకులు, కార్యకర్తలను సమాయత్తం చేస్తున్నారు. ట్విట్టర్, ఫేస్‌బుక్, వాట్సాప్ వంటి సోషల్ మీడియా ద్వారా పార్టీకి సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు చేరవేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ వ్యవహారాలలో ఇప్పటివరకు కొనసాగుతున్న విధానాలను సమీక్షించుకుని అవసరమైన అంశాలలో కొన్ని మార్పులు చేర్పులు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. మొత్తంగా బలమైన ప్రతిపక్షంగా అధికార పార్టీ పై స్థానిక సమరానిక్షి పార్టీ శ్రేణులను సమాయత్తం చేయిస్తుండటం జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు రేగా కాంతారావు రాజకీయ వ్యూహాలపై సర్వత్రా ఆసక్తిని కలిగిస్తోంది.




## పార్టీని పటిష్టం చేసే దిశగా అడుగులు

గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో పార్టీ స్థితిగతులపై దృష్టి పెట్టి క్షేత్రస్థాయిలో బలహీనంగా ఉన్న చోట బలపడేందుకు దృష్టి సారించారు. ఇందులో భాగంగా జిల్లాల్లో అన్ని మండల, పట్టణ కమిటీల అధ్యక్షులను నియమించి, పార్టీని అజేయంగా తీర్చిదిద్దేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ముఖ్యంగా ఇతర పార్టీల్లోన్ని క్రియాశీల నాయకులను పార్టీలోకి ఆహ్వానించడంతోపాటు సొంత పార్టీలో అసంతృప్తితో ఉన్న ద్వితీయ శ్రేణి నాయకులను బుజ్జగించి స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి తిరుగులేని విజయాన్ని తమ ఖాతాలో వేసుకోవాలనే ఆలోచనతో ముందుకు సాగుతున్నారు. క్షేత్రస్థాయిలో నిత్యం పర్యటనలు జరుపుతూ కేడర్‌ను ఉత్తేజ పరిచే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటినుంచే పార్టీనీ బలోపేతం చేస్తే స్థానిక ఎన్నికలకు ధీమాగా వెళ్లవచ్చనే అంచనాతో ఉన్నారు. మండల, గ్రామస్థాయిల్లో నేతల మధ్య సమన్వయ లోపం, అంతర్గత విబేధాలు ఉన్న విషయాన్ని గుర్తించిన ఆయన వారితో మాట్లాడి వారి సమస్యలను చక్కదిద్ది శ్రేణులను ఒక్క తాటిపై తీసుకురావడంతో పార్టీ శ్రేణులలో జోష్ నెలకొంది. ముఖ్యంగా రాబోయే సంస్థాగత ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని దూకుడు పెంచారు. ఇందులో భాగంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిక ఓటు బ్యాంకు హస్తం వైపు నుండి గులాబీ పార్టీ వైపుకు తిప్పకునేలా పక్క వ్యూహాలు రచిస్తున్నారు.



### తప్పు చేసినవారికి ఇందిరమ్మ రాజ్యంలో

# శిక్ష తప్పదు

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**పాలేరు, నవంబర్ 9, మహా:** ప్రజలకు చెందాల్సిన ప్రజాధనాన్ని దొడ్డిదారిలో, తప్పు దోవలో పందికొక్కుల వలే తినేస్తే ఇందిరమ్మ రాజ్యం ఊరుకునే పరిస్థితి లేదని, తప్పు చేసినవారికి ఇందిరమ్మ రాజ్యంలో ఖచ్చితంగా శిక్ష తప్పదని, తప్పుచేసిన వారు శిక్షించబడతారని, చట్టం తన పని తాను చేసుకుంటూ బోతుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కూసుమంచి మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజలకు సంబంధించిన ధనాన్ని ప్రజలకు, ప్రజల అవసరాల కోసం ఉపయోగించాలని, తెలంగాణ ప్రజల సొమ్మును ఇతర దేశాలకు పంపించి ఇష్టానుసారంగా వాడుకుంటే చట్టం ఊరుకుంటుందా..? అని ప్రశ్నించారు. ప్రజాధనాన్ని కొందరు ఇష్టానుసారంగా వాడుకున్నారని, ఈ విషయంలో తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం చట్టపరమైన, న్యాయపరమైన విచారణ చేయిస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రజల సొమ్మును దుర్వినియోగం చేస్తే తప్పు చేసిన వారిని ఎవరినైనా వదలే ప్రసక్తే లేదని, ఎంత పెద్ద వారైనా శిక్షించబడతారని మంత్రి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కొందరు నాయకులు గుమ్మడికాయల దొంగ ఎవరంటే భుజాలు తడుముకుంటున్నారని, తప్పు చేయని వారు ఎందుకు భయపడుతున్నారో అర్థం కావట్లేదని మంత్రి వ్యంగ్యాస్త్రాలు సందించారు. జైలుకు పంపిస్తే యోగా చేసుకుంటాను ఆ తర్వాత వచ్చి పాదయాత్ర చేస్తాను అని ఓ నాయకుడు చెబుతుంటే హాస్యాస్పదంగా ఉందన్నారు. తనంతట తానే తప్పు చేశానని ఒప్పుకున్నట్లు లేదా..? ప్రజలే ఆలోచించాలని కోరారు. మాకు ఎవరిపై కక్ష్య సాధింపు లేదని, ఎవరిపై కక్ష్య సాధింపు చర్యలు తీసుకోవాలని కోరుకోవడం లేదన్నారు. తమకు రాజకీయ స్వార్థం ఉండదని, ప్రజల సొమ్మును ప్రజలకు, ప్రజా అవసరాలకు ఖర్చు చేసేందుకు ఆలోచిస్తామన్నారు. గత ప్రభుత్వం ప్రజల సొమ్మును పక్కదోవ పట్టిస్తే చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందన్నారు. తనపై కావాలనే తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని, తనని టార్గెట్ చేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు.

చట్టం ఎవరికీ చుట్టం కాదని గత పాలకులే చెప్పారని, తమ ప్రభుత్వంలో కూడా అదే ఆచరిస్తామన్నారు. మూసీని సుందరీకరణ చేస్తామని అంటుంటే అడ్డు పడుతున్నారని, ప్రజలకు మేలు చేస్తామంటే అడ్డు పడుతున్నారన్నారు. గత పాలకులకు ప్రజల ఓట్లు కావాలే తప్ప ప్రజలకు మేలు చేయొద్దని, అలా చేస్తే అడ్డుపడుతారని, పేద ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసి తాత్కాలిక ఆనందం పొందుతారని ఆరోపించారు. లక్ష రూపాయల రుణమాఫీ చేయలేక చితికలబడిన బీఆర్ఎస్ పెద్దలు, ఇందిరమ్మ రాజ్యంలో 90 రోజుల్లోనే 18 వేల కోట్ల రూపాయలను రుణమాఫీ చేస్తే రుణమాఫీ ఎవరికి రాలేదని తప్పుడు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. రుణమాఫీ విషయంలో తాము తప్పు చెప్పడం లేదన్నారు. మొత్తం రూ.35వేల కోట్ల రుణమాఫీ చేయాల్సి ఉందని, ఇప్పటివరకు 18వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేశామని, మరో 17వేల కోట్ల రూపాయలతో రుణమాఫీ చేయాల్సి ఉందని, కచ్చితంగా డిసెంబర్ చివరి వారంలోపూ రుణమాఫీ చేస్తామన్నారు. రైతు భరోసా నిధులను త్వరలో మంజూరు చేస్తామన్నారు. రైతులు సాగు చేసిన పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తామని, రూ.500 అదనంగా ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించాలి

### హైకోర్టు జడ్జి లక్ష్మీ నారాయణ అలిశెట్టి



**ములుగు జిల్లా ప్రతినిధి, నవంబర్ 9, మహా:** న్యాయ సేవా అధికార సంస్థ పట్ల ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని, రూరల్ ఏరియాలో చైల్డ్ మ్యారేజ్, చైల్డ్ లేబర్ మరియు లేబర్ యాక్ట్ గురించి అవగాహన కల్పించాలని హైకోర్టు న్యాయమూర్తి, ములుగు జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి లక్ష్మీ నారాయణ అలిశెట్టి అన్నారు. శనివారం ములుగు కోర్టులో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ న్యాయ సేవాధికార సంస్థ దినోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. న్యాయ సేవా అధికార సంస్థ గురించి ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. న్యాయ వ్యవస్థ పట్ల ప్రజలకు చట్టాల పై వివరించాలని అన్నారు. న్యాయం గెలవలన్నదే లక్ష్యంగా పని చేయాలని అన్నారు. ఈ సందర్భంగా న్యాయవాదులు, అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. అనంతరం జాతీయ న్యాయ సేవా అధికారం సంస్థ దినోత్సవాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, ఎస్ వీపీ సూర్య చంద్రకళ, సీనియర్ సివిల్ జడ్జి కన్నయ్య లాల్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జె. సౌఖ్య, ఆర్డీఓ ఎన్. వెంకటేష్, డీఎస్పీ రవీందర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.వినయ్ కుమార్, జనరల్ సెక్రటరీ కె. సునీల్ కుమార్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొని డెలివరీ బాయ్ మృతి

హన్మకొండ, నవంబర్ 9, మహా: జిల్లా కేంద్రంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఫుడ్ డెలివరీ బాయ్ దుర్మరణం చెందాడు. ఇందుకు సంబంధించి వివరాల్లోకి వెళితే.. హన్మకొండ నుంచి వేలేరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు హరిగ్రీవచారి గ్రౌండ్ వద్ద జొమాటో డెలివరీ బాయ్ చంద్ ను ఢీకొట్టింది. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే అతడు మృతిచెందాడు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని ఎంజీఎంకు తరలిస్తున్న తరుణంలో విషయం తెలుసుకున్న మిగతా డెలివరీ బాయ్స్ అక్కడికి చేరుకుని ఆందోళన చేపట్టారు.



## సర్వేను పరిశీలించిన ఎమ్మార్వో

**బోనకల్, నవంబర్ 9, మహా:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేను సమర్థవంతంగా పూర్తి చేయాలని, పక్కాగా వివరాలు సేకరించాలని మండల తహశీల్దార్ అనిశెట్టి పున్నం చందర్ ఎన్యూమరేటర్లను ఆదేశించారు. శనివారం మండలంలోని బోనకల్లు గ్రామంలో బ్లాక్ నెంబర్ 69 ముత్యాలమ్మ సెంటర్, రావినూతల గ్రామాల్లో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే తీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్యూమరేటర్లకు పలు సూచనలు చేశారు. ఇప్పటివరకు మండల కేంద్రంలో నిర్వహించిన ఇంటింటి సర్వేలో మండల వ్యాప్తంగా 16378 ఇళ్లకు స్టిక్కర్ వేసి గుర్తించి, 144 ఎన్యూమరేటర్ బ్లాకులుగా విభజించడం జరిగిందని, 110 మంది ఎన్యూమరేటర్స్ తోపాటు, 9 మంది సూపర్వైజర్లు ఈ సర్వే ప్రక్రియను పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. ప్రజల నుంచి సేకరించిన వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ప్రజల ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సరైన సమాచారం ఇస్తే భవిష్యత్తులో వివిధ సంక్షేమ పథకాలకు ఉపయోగపడేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. వివరాలన్నీ ప్రతిరోజూ సాయంత్రం 6 గంటలకు తెలియజేయాలని సర్వే అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ వీవీఎస్ శాస్త్రీ, ఆర్ఐ జీ లక్ష్మణ్ ఉన్నారు.

### మతోన్మాదాన్ని అడ్డుపెట్టుకుని

# రాజకీయం చేస్తున్నారు

### పోతినేని సుదర్శన్



**ఖమ్మం, నవంబర్ 9, మహా:** భారతీయ జనతా పార్టీ దేశంలో హిందూ మతోన్మాదాన్ని అడ్డుపెట్టుకొని రాజకీయాలు చేస్తుందని, అయోధ్యలో జరిగిన ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూసినా బీజేపీ అభ్యర్థిని ప్రజలు తిరస్కరించాలని సీపిఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విమర్శించారు. ఖానాపూరం హవేలీ 8వ మండల మహాసభ సందర్భంగా 2005లో మణుగూరులో జరిగిన సీపీఎం పార్టీ జిల్లా మహాసభలకు వెళ్లి తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన ఆరుగురు అమరవీరుల జ్ఞాపకార్థంగా నిర్మించిన స్థూపాన్ని రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు ఆవిష్కరించారు. అనంతరం స్థూపం వద్ద పార్టీ జెండాని జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు బుగ్గ వీటిసరళ ఆవిష్కరించారు. అక్కడి నుండి ప్రదర్శనతో టేకులపల్లి గ్రామంలో జరిగిన మహాసభ ప్రాంగణానికి మహాసభ ప్రారంభ సూచకంగా పార్టీ జెండాని సీనియర్ నాయకులు పెద్ది నాగయ్య ఆవిష్కరించారు. అనంతరం అమరపోయిన శివరాం ప్రసాద్ నగర్ లో జరిగింది ప్రారంభ సభకు అధ్యక్ష వర్గంగా అమరబోయిన అంజని జట్ల ఆనందరావు కొంగరి నవీన్ అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ఈ సభలో సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు మాట్లాడుతూ దేశంలో మోడీ అధికారంలోకి వచ్చాక నల్లధనం మొత్తం బయటికి తీస్తానని, ప్రతి కుటుంబానికి 15 లక్షల రూపాయలు జండన్ ఖాతా ద్వారా ఎకౌంట్లో వేస్తానంటూ రెండోసారి అధికారంలోకి వచ్చాక నల్లధనం వెలికితీయపోక దేశ సంపదను దోచుకుని బడా పెట్టుబడిదారులకు కాపాడే ప్రయత్నం చేశాడని ఆరోపించారు. మతం పేరుతో కల్లోలాలు సృష్టించి దేశంలో హిందూ మతోన్మాదాన్ని అడ్డం పెట్టుకొని బీజేపీ రాజకీయం చేస్తుందన్నారు. అనంతరం కార్యదర్శి నివేదికను పార్టీ మండల కార్యదర్శి దొంగల తిరుపతరావు ప్రవేశ పెట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు య శ్రీకాంత్, మాచర్ల భారతి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కళ్యాణ వెంకటేశ్వరరావు, వై విక్రం, జిల్లా కమిటీ సభ్యులు పిన్నింటి రమ్య, ఎర్ర శ్రీనివాసరావు రాళ్లపల్లి కృష్ణ బండారు రమేష్ పారుపల్లి ఝాన్సీ, నవీన్ రెడ్డి ఎంఏ జబ్బార్, స్థానిక నాయకులు పార్టీ మండల కమిటీ సభ్యులు, పార్టీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నూతన కమిటీని 20 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన మండల కార్యదర్శిగా దొంగల తిరుపతిరావును తిరిగి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మహాసభలో త్వరలో జరగబోయే డివిజన్ మహాసభకు 56 మంది ప్రతినిధులను ఎంపిక చేశారు.

## సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి

### జిల్లా అడిషనల్ ఎస్పీ చెన్నయ్య



**మహబూబాబాద్, నవంబర్ 9, మహా:** జిల్లా కేంద్రంలోని వైద్య కళాశాలలో పోలీసుల ఆధ్వర్యంలో యాంటీ ర్యాగింగ్, మాదకద్రవ్యాల నిర్మూలన, సైబర్ క్రైమ్ లపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఏఎస్పీ చెన్నయ్య మాట్లాడుతూ... విద్యార్థులు ర్యాగింగ్, మాదక ద్రవ్యాల అలవాట్లకు లోనుకాకుండా ఉన్నత లక్ష్యాలపై దృష్టి సారించాలన్నారు. సెంట్రల్ పోలీసులు లోకల్ పోలీసులను సంప్రదించకుండా నేరుగా ఎవరికీ ఫోన్ చేయరన్నారు. సీబీఐ, సెంట్రల్ ఎన్ ఫోర్స్‌మెంట్ ఏజెన్సీస్ పేరుతో ఎవరైనా ఫోన్ కాల్స్ వస్తే వాటిని వెంటనే కట్ చేయాలన్నారు. డ్రగ్స్ పేరుతో భయపెట్టి నగదు బదిలీ చేయాలని బెదిరిస్తే ఎవరూ స్పందించొద్దన్నారు. అదేవిధంగా ఓటీపీలను కూడా ఇతరులకు ఎట్టి పరిస్థితుల్లో షేర్ చేయకూడదన్నారు. అనుమానిత ఫోన్ కాల్స్ వస్తే వెంటనే స్థానిక పోలీసులను ఆశ్రయించాలన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో సీఐ దేవేందర్, ఎస్ఐలు రమాదేవి, సునంద, కళాశాల ప్రిన్సిపాల్ లకావత్ వెంకన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

# స్విగ్గీ ఐపీవో భేష్




**న్యూఢిల్లీ, మహా:** ఫుడ్ డెలివరీ సేవల సంస్థ స్విగ్గీ ఐపీవోకి రిటైల్ పెట్టుబడిదారుల నుంచి విశేష స్పందన లభించింది. తొలి రెండు రోజుల్లో మిశ్రమంగా ఉన్న ఈ వాటా విక్రయానికి చివరి రోజు ఎగబడి కొనుగోళ్లు జరిపారు. దీంతో కంపెనీ జారీ చేసిన షేర్లకు నాలుగు రెట్ల అధిక బిడ్డింగ్‌లు వచ్చాయని పేర్కొంది. రూ.11 వేల కోట్ల వాటా విక్రయానికి సంబంధించి సంస్థ జారీ చేసిన 16,01,09,703 షేర్లకుగాను 57,53,07,536 షేర్ల బిడ్డింగ్‌లు వచ్చాయి. షేరు ధరల శ్రేణిని రూ.371390 స్థాయిలో నిర్ణయించింది.

### 20న మార్కెట్లకు సెలవు

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరుగుతుండటంతో ఈ నెల 20న స్టాక్ మార్కెట్లు సెలవు పాటించనున్నాయి. బీఎస్ఈతోపాటు ఎన్ఎస్ఈ, ఫ్యూచర్ అండ్ ఆప్షన్స్, సెక్యూరిటీస్ లెండింగ్ అండ్ బారోయింగ్ విభాగం కూడా మూసివేసివుంచనున్నారు. ప్రస్తుత నెలలో స్టాక్ మార్కెట్లు సెలవు పాటించడం ఇది మూడోసారి. నవంబర్ 1న దీపావళి సందర్భంగా మూసివేసివుంచగా, గురు నానక్ జయంతి సందర్భంగా ఈ నెల 15న సెలవు పాటించనున్నాయి.

## టాటా మోటర్స్‌కు అమ్మకాల సెగ..

### 10 శాతం తగ్గిన నికర లాభం

**న్యూఢిల్లీ, మహా:** దేశీయ ఆటోమొబైల్ దిగ్గజాల్లో ఒకటైన టాటా మోటర్స్ లాభాలకు బ్రేక్‌పడింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికిగాను సంస్థ రూ.3,450కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో వచ్చిన రూ.3,832కోట్ల లాభంతో పోలిస్తే 9.9 శాతం పడిపోయింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.1,04,444 కోట్ల నుంచి రూ.1,00,534 కోట్లకు పడిపోయినట్లు వెల్లడించింది. అమ్మకాలు తగ్గుముఖం పట్టడం వల్లనే లాభాల్లో క్షీణత కనబరిచినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. నిర్వహణ ఖర్చులు రూ.1,00,649 కోట్ల నుంచి రూ.97,330 కోట్లకు తగ్గాయి. జేఎల్‌ఆర్ ఆదాయం 5.6 శాతం తగ్గి 6.5 బిలియన్ పౌండ్లకు పడిపోయింది. గత త్రైమాసికంలో సంస్థ ప్యాసింజర్ వాహన విక్రయాలు 6.1 శాతం




తగ్గి 1,30,500కు పడిపోయాయి. కమర్షియల్ వాహన అమ్మకాలు కూడా ఏడాది ప్రాతిపదికన 19.6 శాతం తగ్గి 79,800కి తగ్గాయి. ఐటీ సేవల సంస్థ విప్రోలో 1.6 శాతం వాటాను కొనుగోలు చేసింది ప్రైవేట్ ఈక్విటీ సంస్థ ప్రేమ్‌జీ. పూర్తిగా బ్లాక్‌డీల్‌లో జరిగిన ఈ ఒప్పందం విలువ రూ.4,757 కోట్లు. షేరుకు రూ.560 చొప్పున 8,49,54,128 షేర్లను బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేసింది. దీంతో విప్రోలో అజీం ప్రేమ్‌జీకి చెందిన ప్రేమ్‌జీ ట్రేడర్ 4.49 కోట్ల షేర్లను కొనుగోలు చేసినట్లు అయింది.



## ఎస్బీఐ లాభం 19,782 కోట్లు..

### రూ.1.29 లక్షల కోట్లకు ఆదాయం

### క్యూ2లో 23 శాతం పెరిగిన ప్రాఫిట్

**ముంబై, మహా:** దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) ఆర్థిక ఫలితాల్లో అంచనాలకుమించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికిగాను బ్యాంక్ రూ.19,782 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.16,099 కోట్ల లాభంతో పోలిస్తే 23 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నది. ఏకీకృత విషయానికి వస్తే బ్యాంక్ రూ.18,331 కోట్ల లాభాన్ని గడించింది. అటు ఆదాయంలోనూ రికార్డు నెలకొల్పింది. గత త్రైమాసికంలో బ్యాంక్ రూ.1.29 లక్షల కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. బ్యాంక్ చైర్మన్‌గా సీఎస్ శెట్టి పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇంతటి స్థాయిలో ఆదాయం ఆర్జించడం ఇదే తొలిసారి. ఏడాది క్రితం ఇది రూ.1.12 లక్షల కోట్లుగా ఉన్నది. సమీక్షకాలంలో బ్యాంక్ నిర్వహణ ఖర్చులు రూ.92,752 కోట్ల నుంచి రూ.99,847 కోట్లకు పెరిగినట్లు వెల్లడించారు. మొండి బకాయిలను పూడ్చుకోవడానికి బ్యాంక్ అధిక స్థాయిలో నిధులను కేటాయించింది. గత త్రైమాసికానికిగాను బ్యాంక్ రూ.3,631 కోట్ల నిధులను కేటాయించింది. అంతక్రితం ఏడాది రూ.1,814 కోట్లతో పోలిస్తే రెండు రెట్లు పెరిగినట్లు బ్యాంక్ వర్గాలు వెల్లడించాయి.



# రూపాయికి మరిన్ని చిల్లులు

### చారిత్రక కనిష్ఠ స్థాయికి పడిపోయిన విలువ.. డాలర్‌తో పోలిస్తే 5 పైసలు తగ్గి 84.37కి

**ముంబై, మహా:** దేశీయ కరెన్సీ విలువ చారిత్రక కనిష్ఠ స్థాయికి దిగజారింది. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా పెట్టుబడులను ఉపసంహరించుకోవడం, ఈక్విటీ మార్కెట్లు నిలకడగా ట్రేడవడంతో మారకంపై ప్రతికూల ప్రభావం పడింది. ఫలితంగా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ వరుసగా మూడోరోజూ శుక్రవారం కూడా 5 పైసలు నష్టపోయి రికార్డు స్థాయికి పడిపోయింది. ఫారెక్స్ మార్కెట్ ముగిసే సమయానికి డాలర్‌రుపీ ఎక్స్చేంజ్ రేటు 84.37కి జారుకున్నది. 84.32 వద్ద ప్రారంభమైన డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ ఒక దశలో 84.31 గరిష్ఠ స్థాయిని తాకింది. ఇంట్రాడేలో 84.38 కనిష్ఠ స్థాయిని తాకిన విలువ చివరకు ఐదు పైసల నష్టంతో 84.37 వద్ద ముగిసింది. గురువారం మారకం విలువ ఒక్క పైసా నష్టపోయిన విషయం తెలిసిందే. దీంతో వరుసగా మూడు సెషన్లలో రూపాయి విలువ 28 పైసలు నష్టపోయింది. దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా నిధులను తరలించుకుపోవడం, అంతర్జాతీయ మార్కెట్లో ఇంధన ధరలు భారీగా పతనమవడం కూడా రూపాయి పతనానికి ఆజ్యం పోశాయని బీఎన్‌పీ పరిబాస్ రీసర్చ్ హెడ్ అనూజ్ చౌదరీ తెలిపారు.

### మరింత కరిగిన విదేశీ నిల్వలు

విదేశీ మారకం నిల్వలు కరిగిపోయాయి. విదేశీ మారకం రూపంలో ఉన్న ఆస్తుల విలువ అంతకంతకు తగ్గిపోవడంతో నవంబర్ 1తో ముగిసిన వారాంతానికిగాను ఫారెక్స్ రిజర్వులు 2.67 బిలియన్ డాలర్లు తరిగిపోయి 682.13 బిలియన్ డాలర్లకు తగ్గాయని ఆర్బీఐ తన వారాంతపు సమీక్షలో వెల్లడించింది. అంతక్రితం వారంలోనూ రిజర్వులు 3.463 బిలియన్ డాలర్లు తగ్గి 684.805 బిలియన్ డాలర్లకు పడిపోయిన విషయం తెలిసిందే. సెప్టెంబర్ చివరినాటికి రికార్డు స్థాయి 704.885 బిలియన్ డాలర్లకు చేరుకున్న ఫారెక్స్ రిజర్వులు ఆ మరుసటి నుంచి దిగువముఖం పట్టాయి. గత వారాంతానికిగాను విదేశీ కరెన్సీ రూపంలో ఉన్న ఆస్తుల విలువ 3.902 బిలియన్ డాలర్లు తగ్గి 589.849 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. డాలర్‌తోపాటు ఇతర కరెన్సీలు యూరో, పౌండ్, యెన్ కరెన్సీలు పతనం చెందడం ఇందుకు కారణమని తెలిపింది. కానీ, పసిడి రిజర్వులు 1.224 బిలియన్ డాలర్లు పెరిగి 69.751 బిలియన్ డాలర్లకు చేరుకున్నట్లు వెల్లడించింది.

### దెబ్బతీసిన ఫెడ్ నిర్ణయం

అమెరికా ఫెడరల్ రిజర్వు మరోసారి వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలుండటంతో ఇతర కరెన్సీలు తీవ్ర ఆటుపోటులకు గురయ్యాయని ఫారెక్స్ ట్రేడర్ వెల్లడించారు. అమెరికా అధ్యక్షుడిగా గెలుపొందిన డొనాల్డ్ ట్రంప్..పన్ను, వాణిజ్య విధానాలు గ్లోబల్ ఆర్థిక మార్కెట్లను ప్రభావితం చేస్తాయోమోననే ఆందోళనలు నెలకొన్నాయని, అందుకే రూపాయి ఒడిదుడుకులు లోనవుతుందన్నారు. గతవారంలో పావు శాతం వడ్డీరేట్లను తగ్గించిన ఫెడ్..వచ్చే సమీక్షలోనూ ఇంతే స్థాయిలో తగ్గించే అవకాశం ఉన్నట్లు వచ్చిన సంకేతాలు ఫారెక్స్ మార్కెట్లో ప్రకంపనాలు సృష్టించింది. బ్యారెల్ క్రూడ్ ధర 1.10 శాతం తగ్గి 74.80 డాలర్లకు చేరుకుంది. దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి ఎఫ్ఐఐలు శుక్రవారం రూ.3,404 కోట్ల పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు.

# దేశం-విదేశం NATIONAL NEWS

## లక్నో వెళ్తున్న వందే భారత్ రైలుపై రాళ్ల దాడి..

### యువకుడు అరెస్ట్



**మహా, జాతీయం:** కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన సెమీహైస్పీడ్ వందే భారత్ రైళ్లపై దాడులు కొనసాగుతున్నాయి. తాజాగా ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్ నుంచి ఉత్తరప్రదేశ్ లక్నోకు వెళ్తున్న రైలుపై రాళ్ల దాడి జరిగింది. ఈ ఘటనలో ఓ యువకుడిని పోలీసులు తాజాగా అరెస్ట్ చేశారు. 22546 నంబర్ గల వందే భారత్ రైలు గురువారం లక్నోకు వెళ్తోంది. ఈ క్రమంలో లక్సర్ - మొరదాబాద్ రైల్వే సెక్షన్‌లోని ఖరంజా కుతుబ్‌పూర్ గ్రామ సమీపంలోకి రాగానే రైలుపై కొందరు రాళ్లు రువ్వారు. ఈ దాడిలో C6 కోచ్ కిటికీ అద్దానికి పగుళ్లు ఏర్పడ్డాయి. ఈ ఘటనతో రైల్లోని ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటనపై లోకో పైలట్ మొరదాబాద్‌లోని కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించారు. ఆర్‌పీఎఫ్‌కు చెందిన బృందం కుతుబ్‌పూర్ గ్రామానికి చేరుకొని ఘటనపై విచారణ చేపట్టింది. ఈ మేరకు 22 ఏళ్ల సల్మాన్ అనే యువకుడిని అరెస్ట్ చేసినట్లు అధికారులు శనివారం తెలిపారు.

## భారత పరిశ్రమలకు రతన్ టాటా ఎప్పటికీ ప్రేరణగా నిలుస్తారు: ప్రధాని మోదీ

**మహా, న్యూఢిల్లీ:** టాటా సంస్థల అధినేత రతన్ టాటా మృతిచెంది నెల రోజులు కావస్తున్నది. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ.. ఓ ఆర్టికల్ రాశారు. దిగ్గజ వ్యాపారవేత్త రతన్ టాటాకు తన వ్యాసంతో నివాళి అర్పించారు. సమాజంలోని అన్ని రంగాలు రతన్ టాటా లేని లోటును ఫీలవుతున్నాయన్నారు. సీజనల్ వ్యాపారవేత్తలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, ప్రొఫెషనల్స్ ఆయన మృతి పట్ల సంతాపం ప్రకటిస్తున్నట్లు చెప్పారు. పర్యావరణం, దాతృత్వం పట్ల శ్రద్ధ ఉన్నవాళ్లు కూడా రతన్ మృతితో విషాదంలో ఉన్నట్లు రాశారు. ఈ దేశంలోనే కాదు.. ప్రపంచవ్యాప్తంగా రతన్ మరణం అందర్నీ కలిచివేసిందన్నారు.



యువతకు రతన్ ప్రేరణగా నిలిచారన్నారు. భారతీయ సంప్రదాయాలను ఎందరికో పరిచయం చేశారని, సమగ్రతకు.. సేవకు ఆయన కట్టుబడి ఉన్నట్లు మోదీ తెలిపారు. రతన్ నాయకత్వంలో టాటా గ్రూపు కొత్త తీరాలకు వెళ్లిందన్నారు. విశ్వాసం, గౌరవం, నమ్మకాన్ని ఆ సంస్థ పొందిందన్నారు. సాధించిన ఘనతల పట్ల ఆయన వినయంగా ఉండేవారన్నారు. మరొకరి ఆశయాలకు మద్దతు ఇవ్వడం ఆయన ఉత్తమ లక్షణమన్నారు. భారత్‌లో స్టార్టప్ వ్యవస్థను ముందుకు తీసుకెళ్లడంతో రతన్ టాటా మెంటర్‌గా వ్యవహరించినట్లు ప్రధాని మోదీ తెలిపారు. స్టార్టప్‌లకు ఊతం ఇవ్వడం వల్ల.. ఆవిష్కరణలు, పారిశ్రామీకరణల్లో కొత్త సంస్కృతి ఏర్పడిందన్నారు. రతన్ చూపిన పాజిటివ్ సంకేతం .. రాబోయే దశాబ్దాల్లో ఇండియాను మరింత తీర్చిదిద్దుతుందని ఆశిస్తున్నట్లు మోదీ పేర్కొన్నారు.


ప్రపంచస్థాయికి తగ్గట్లుగా బెంచ్‌మార్క్‌లను సెట్ చేయాలని భారతీయ వ్యాపారవేత్తలను రతన్ ప్రోత్సహించినట్లు ప్రధాని తన వ్యాసంలో వెల్లడించారు. ప్రపంచ స్థాయి సదుపాయాలు కల్పించడంలో.. రతన్ విజన్.. భారత భవిష్యత్తు నాయకులకు ఇన్‌స్పిరేషన్‌గా నిలుస్తుందని ఆశించారు. బోర్డు రూమ్‌లకో లేక మనుషులకు సాయం చేయడమే కాదు.. ఆయన గొప్ప జంతు ప్రేమికుడు అని కూడా తెలిపారు. రతన్ తన శునకానికి చెందిన ఫోటోను ఎప్పుడూ అప్‌డేట్ చేసేవారన్నారు. గొప్ప నాయకుడిని తన సక్సెస్‌ను బట్టి అంచనా వేయడం కాదు అని, ఆ వ్యక్తి నిస్సహాయులను ఆదుకున్న సామర్థ్యాన్ని బట్టి అంచనా వేస్తారన్నారు.అత్యంత క్లిష్ట సమయాల్లో రతన్ టాటా తనలోని దేశభక్తిని చాటారన్నారు. కోట్లాది మంది భారతీయుల ఆ దేశభక్తిని ప్రత్యక్షంగా తిలకించినట్లు చెప్పారు. ముంబై దాడుల తర్వాత తాజ్ హోటల్ రీఓపెన్ చేసిన తీరు దేశానికి మేలుకొలుపు వంటిదన్నారు. భారత్ ఐక్యంగా ఉన్నదని, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా తమ పోరాటాన్ని ప్రదర్శించినట్లు మోదీ తెలిపారు. రతన్ వ్యక్తిగతంగా తనకు ఎన్నో ఏళ్లుగా తెలుసు అని, గుజరాత్‌లో కలిసి పనిచేశామన్నారు. అక్కడ ఆయన ఎన్నో ప్రాజెక్టుల్లో పెట్టుబడి పెట్టినట్లు చెప్పారు. కొన్ని రోజుల క్రితం స్పెయిన్ ప్రెసిడెంట్‌తో కలిసి వడోదరలో సీ295 విమాన తయారీ కాంప్లెక్స్‌ను ఓపెన్ చేసినట్లు తెలిపారు. రతన్ టాటానే ఆ కాంప్లెక్స్ గురించి ప్లాన్ వేశారన్నారు. ఎయిర్‌క్రాఫ్ట్ కాంప్లెక్స్ ఓపెనింగ్ సమయంలో రతన్ లేకపోవడం శోచనీయమన్నారు. రతన్ టాటా తనకు రెగ్యులర్‌గా లేఖలు రాసేవారన్నారు. ప్రభుత్వ పాలన అయినా లేక శుభాకాంక్షల సందేశాలైనా.. ఆయన క్రమంగా లేఖలు రాసేవారని ప్రధాని తెలిపారు. తమ సర్కారు చేపట్టిన స్వచ్ఛ భారత్ మిషన్‌కు రతన్ టాటా మంచి సపోర్టు ఇచ్చినట్లు తెలిపారు. దేశ ప్రగతిలో పరిశుభ్రత, స్వచ్ఛత, శానిటేషన్ చాలా కీలకమైనవని రతన్ నమ్మేవారన్నారు. హెల్త్‌కేర్ అంశంలోనూ ఆయన రాజీలేని పోరాటం చేశారన్నారు. క్యాన్సర్‌పై పోరాటంలో భాగంగా అస్సాంలో అనేక ఆస్పత్రులను ఓపెన్ చేసినట్లు చెప్పారు. ఆరోగ్యం, క్యాన్సర్ చికిత్స అందుబాటులోకి తెవాలన్న ఆశయం రతన్‌లో ఉన్నట్లు తెలిపారు. భారత్‌ను ఉత్తమ ప్రదేశంగా తీర్చిదిద్దిన ఆయన పట్ల రాబోయే తరాలు కృతజ్ఞతతో ఉంటారన్నారు.

## ఆ టార్చర్ భరించలేక ఉగ్రవాదిలా మారాలనుకున్నా

### : నేషనల్ కాన్ఫరెన్స్ ఎమ్మెల్యే

**మహా, జాతీయం:** ఆర్మీ అధికారి చిత్రహింసల వల్ల తాను ఉగ్రవాదిలా మారాలనుకున్నానని నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ ఎమ్మెల్యే కైసర్ జంషేద్ లోన్ చెప్పారు. అయితే ఒక సీనియర్ అధికారి మాటల ద్వారా తనకు వ్యవస్థపై నమ్మకం కలిగిందని అన్నారు. జమ్ముకశ్మీర్ అసెంబ్లీలో లెఫ్టినెంట్ గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై శుక్రవారం చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కైసర్ జంషేద్ లోన్ సభలో మాట్లాడారు. చిన్నప్పుడు తాను నివసించే ప్రాంతంలో జరిగిన ఓ ఉగ్రవాదుల దాడి గురించి తనతో సహా 32 మంది యువకులను ఆర్మీ అధికారి ప్రశ్నించారని లోన్ తెలిపారు. టెర్రరిస్టుల్లో చేరిన యువకుడు తెలుసా..? అని ఆ అధికారి తనను అడిగితే తెలుసని తాను చెప్పానని, దాంతో ఆ మిలిటరీ అధికారి తనను కొట్టారని ఆయన చెప్పారు. 'ఇప్పుడు జరిగిన ఉగ్రదాడిలో ఆ యువకుడు పాల్గొన్నాడా..?' అని ఆర్మీ అధికారి మరో ప్రశ్న అడిగారని, తాను లేదని చెప్పడంతో మళ్లీ కొట్టారని అన్నారు.

ఇంతలో ఒక సీరియర్ అధికారి అక్కడకు వచ్చి 'నువ్వు జీవితంలో ఏం కావాలనుకుంటున్నావు..?' అని అడిగారని, దాంతో నేను మిలిటెంట్‌గా ఉండాలనుకుంటున్నాను అని చెప్పానని లోన్ చెప్పారు.




అందుకు ఆ సీనియర్ అధికారి కారణం అడుగగా.. ఆర్మీ అధికారి చేతిలో తాను అనుభవించిన చిత్రహింసల గురించి చెప్పానని అన్నారు. వెంటనే తనను హింసించిన అధికారిని సీనియర్ అధికారి బహిరంగంగా మందలించారని ఎమ్మెల్యే కైసర్ జంషైద్ లోన్ తెలిపారు. ఆ సీనియర్ అధికారి చేసిన చర్య వల్లనే వ్యవస్థపై తనకు నమ్మకం కుదిరిందని లోన్ చెప్పారు. సమస్యలను చర్చల ద్వారా ఎలా పరిష్కరించవచ్చో ఈ సంఘటన నిరూపించిందని అన్నారు. అయితే ఆర్మీ వల్ల తనతోపాటు చిత్రహింసలకు గురైన 32 మంది యువకుల్లో 27 మంది ఆ తర్వాత మిలిటెంట్‌లుగా మారినట్లు తనకు తెలిసిందని లోన్ తెలిపారు.

## ఢిల్లీలో కాల్పులు..

### ఒకరు మృతి, ఇద్దరికి గాయాలు

**మహా, న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో కాల్పులు జరిగాయి. ఈ సంఘటనలో ఒక వ్యక్తి మరణించగా మరో ఇద్దరు గాయపడ్డారు. నిందితులైన ముగ్గురు యువకులు మరో చోట కూడా ఒక వ్యక్తి ఇంటి వద్ద కాల్పులు జరిపారు. చివరకు పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. ఈశాన్య ఢిల్లీలోని కబీర్ నగర్ ప్రాంతంలో శుక్రవారం రాత్రి స్కూటర్‌పై ఇంటికి తిరిగి వస్తున్న నదీమ్, అతడి ఇద్దరు స్నేహితులపై బైక్‌పై వచ్చిన ముగ్గురు వ్యక్తులు ఏడు రౌండ్లు కాల్పులు జరిపారు. ఆ తర్వాత నదీమ్ స్కూటర్, మొబైల్ ఫోన్ తీసుకుని పారిపోయారు. వారి బైక్‌ను అక్కడ



వదిలేశారు. కాగా, ఈ కాల్పుల సంఘటనలో నదీమ్ మరణించాడు. అతడి ఇద్దరు స్నేహితులు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులైన ముగ్గురు మైనర్ బాలురను అరెస్ట్ చేసినట్లు చెప్పారు.

## రైలు కోచ్‌ల మధ్య నలిగి కార్మికుడి మృతి



**మహా:** బీహార్ రాష్ట్రంలో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. రైలు కోచ్‌ల మధ్య నలిగి ఓ కార్మికుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన బెగుసరాయ్‌లోని బరౌని జంక్షన్‌లో శనివారం చోటు చేసుకుంది. రైల్వే వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం.. సోన్‌పూర్ రైల్వే డివిజన్ పరిధిలోని స్టేషన్‌లో పనిచేస్తున్న అమర్ కుమార్ రావు శనివారం ప్లాట్‌ఫామ్ 5పై విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆ సమయంలో లక్నో - బరౌనీ ఎక్స్‌ప్రెస్ రాగా.. రైలు కప్లింగ్‌లను తెరిచేందుకు ప్రయత్నించాడు. ఆ సమయంలో రైలు అనూహ్యంగా రివర్స్ రావడంతో రెండు కోచ్‌ల మధ్య అతను ఇరుక్కుపోయాడు. ఈ ఘటనలో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఘటన అనంతరం రైలు డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఘటనపై రైల్వే అధికారులు విచారణ ప్రారంభించారు.



# రాహుల్ అట్టర్ ఫ్లాప్

## రెండో ఇన్నింగ్స్‌లోనూ విఫలం


### భారత్ 'ఏ' రెండో ఇన్నింగ్స్ 73/5

**మహా, మెల్‌బోర్న్:** ఫామ్‌లేమితో సతమతమవుతున్న టీమ్ఇండియా స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా తుది జట్టులో చోటు దక్కించుకోవడం ఇక అనుమానంగానే కనిపిస్తున్నది! ఆస్ట్రేలియా 'ఏ'తో జరుగుతున్న అనధికారిక రెండో టెస్టులో అతడు వరుస ఇన్నింగ్స్‌లలో అట్టర్ ఫ్లాఫ్ అయ్యాడు. తొలి ఇన్నింగ్స్‌లో 4 పరుగులే చేసిన రాహుల్.. సెకండ్ ఇన్నింగ్స్‌లోనూ 44 బంతులాడి 10 పరుగులే చేసి క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. ఇక మ్యాచ్ విషయానికొస్తే రెండో ఇన్నింగ్స్‌లో భారత టాపార్డర్ మరోసారి కుప్పకూలింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 31 ఓవర్లలో 73 పరుగులే చేసి ఐదు కీలక వికెట్లు కోల్పోయింది. ఫస్ట్ ఇన్నింగ్స్ హీరో ధ్రువ్ జురెల్ (19 నాటౌట్), నితీశ్ రెడ్డి (9 నాటౌట్) క్రీజులో ఉన్నారు. అంతకుముందు ఆస్ట్రేలియా 'ఏ' తొలి ఇన్నింగ్స్‌లో 223 పరుగులకు ఆలౌట్ అయింది. మార్కస్ హరిస్ (74) అర్ధ సెంచరీతో మెరిశాడు. భారత బౌలర్లలో ప్రసిధ్ కృష్ణ (4/50), ముకేశ్ కుమార్ (3/41) రాణించారు.

# టీ20 క్రికెట్‌లో హెన్రిచ్ క్లాసెన్ అరుదైన రికార్డు

**మహా, దర్బన్:** సౌతాఫ్రికా బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్.. తన పవర్ గేమ్‌తో అలరించే విషయం తెలిసిందే. భారీ షాట్లతో ఆకట్టుకునే ఆ హిట్టర్.. టీ20 క్రికెట్‌లో ఓ మైలురాయిని అందుకున్నాడు. టీ20 ఫార్మాట్‌లో ఒకే ఏడాదిలో వంద సిక్సర్లు కొట్టిన బ్యాటర్‌గా ఘనతను సాధించాడు. ఈ ఏడాది క్లాసెన్ టీ20 క్రికెట్‌లో 100 సిక్సర్లు బాదేశాడు. దర్బన్‌లో జరిగిన మ్యాచ్‌లో ఆ మైలురాయి చేరుకున్నాడు. ఆ మ్యాచ్‌లో 22 బంతుల్లో అతను 25 రన్స్ చేశాడు. ఆ ఇన్నింగ్స్‌లో ఓ సిక్సర్ ఉన్నది. ఒకే ఏడాదిలో వంద సిక్సర్లు కొట్టిన ప్లేయర్లలో క్లాసెన్ నాలుగో వ్యక్తి. మిగితా ముగ్గురూ విండీస్ ప్లేయర్లే ఆ లిస్టులో ఉన్నారు. విండీస్ దిగ్గజ బ్యాటర్ క్రిస్ గేల్ 2011, 2012, 2013, 2015, 2016, 2017 లో వందేసి సిక్సర్లు కొట్టాడు. ఆ దేశానికి చెందిన నికోలస్ పూరన్ 2024లో వంద సిక్సర్లు బాదాడు. ఆల్‌రౌండర్ ఆండ్రూ రసెల్ 2019లో ఆ రికార్డు అందుకున్నాడు.





# ఐబీఎస్ఎఫ్ ప్రపంచ బిలియర్డ్స్ టోర్నీ..

## ఫైనల్లో పంకజ్ అద్వానీ

**న్యూఢిల్లీ:** ప్రతిష్ఠాత్మక ఐబీఎస్ఎఫ్ ప్రపంచ బిలియర్డ్స్ టోర్నీలో భారత స్టార్ క్యూయిస్టు పంకజ్ అద్వానీ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. తద్వారా 28వ ప్రపంచ టైటిల్‌కు పంకజ్ మరింత చేరువయ్యాడు. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో పంకజ్ 4-2 తేడాతో భారత్‌కే చెందిన సౌరవ్ కొఠారిపై విజయం సాధించాడు. ఆది నుంచే తనదైన దూకుడు కనబరిచిన ఈ స్టార్ క్యూయిస్టు తొలి గేమ్‌ను కైవసం చేసుకున్నాడు. రెండో గేమ్‌ను సౌరవ్ సొంతం చేసుకోగా, వరుసగా రెండు గేములు గెలిచి పంకజ్ 3-1 ఆధిక్యం కనబరిచాడు. మళ్లీ పుంజుకున్న సౌరవ్ మరో గేమ్ గెలిచి పోటీలోకి రాగా, తన అనుభవాన్ని ఉపయోగించుకుంటూ అద్వానీ విజయాన్ని సొంతం చేసుకున్నాడు. ఫైనల్లో ఇంగ్లండ్‌కు చెందిన రాబర్ట్ హాల్‌తో అద్వానీ తలపడనున్నాడు.

# శాంసన్ ధనాధన్

## వరుసగా రెండో శతకం బాదిన సంజూ

### రాణించిన తిలక్ వర్మ
### స్పిన్నర్ల ధాటికి సఫారీలు విలవిల
### తొలి టీ20లో భారత్ ఘనవిజయం

ప్రధాన ఆటగాళ్ల పనిభారం నిర్వహణలో వరుస అవకాశాలు దక్కించుకుంటున్న వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్.. టీ20 క్రికెట్‌లో ఇప్పటిదాకా మరే భారత క్రికెటర్‌కు సాధ్యం కాని రీతిలో బ్యాక్ టు బ్యాక్ సెంచరీలతో విరుచుకుపడటంతో దక్షిణాఫ్రికా పర్యటనలో యువ భారత్ బోణీ కొట్టింది. సంజూ, తిలక్ వర్మ దూకుడుతో భారీ స్కోరుచేసిన టీమ్ఇండియా.. ప్రత్యర్థిని కట్టడిచేయడంలోనూ విజయవంతమైంది. స్పిన్నర్లు వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్ సఫారీలకు చుక్కలు చూపించారు. కింగ్స్‌మీడ్ (దర్బన్): టీమ్ఇండియా వికెట్ కీపర్ సంజూ శాంసన్ (50 బంతుల్లో 107, 7 ఫోర్లు, 10 సిక్సర్లు) శతకంతో కదంతొక్కడంతో దక్షిణాఫ్రికా పర్యటనలో యువ భారత్ బోణీ కొట్టింది. కింగ్స్‌మీడ్ మైదానం వేదికగా ముగిసిన తొలి టీ20లో భారత్ 61 పరుగుల తేడాతో సఫారీలను ఖంగుతినిపించి నాలుగు మ్యాచ్‌ల సిరీస్‌లో 10తో ఆధిక్యంలో నిలిచింది. శాంసన్‌తో పాటు తిలక్ వర్మ (18 బంతుల్లో 33, 3 ఫోర్లు, 2 సిక్సర్లు) వేగంగా ఆడటంతో మొదట బ్యాటింగ్ చేసిన భారత్.. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 202 పరుగులు చేసింది. సౌతాఫ్రికా బౌలర్లలో గెరాల్డ్ కొయెట్జి (3/37) రాణించాడు. అనంతరం భారీ ఛేదనలో సఫారీలు.. భారత స్పిన్నర్ల ధాటికి 17.5 ఓవర్లలో 141 పరుగులకే పరిమితమయ్యారు. హెన్రిచ్ క్లాసెన్ (25) టాప్ స్కోరర్. వరుణ్ (3/25), బిష్ణోయ్ (3/28) దక్షిణాఫ్రికాను కట్టడిచేశారు. సంజూ శాంసన్‌కే 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.



## శాంసన్.. మళ్లీ దంచెన్!

టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన భారత్ ఆది నుంచే వేగంగా ఆడేందుకు యత్నించింది. ఈ వ్యూహాన్ని శాంసన్ పకడ్బందీగా అమలుచేయగా యువ ఓపెనర్ అభిషేక్ శర్మ (7) మరోసారి నిరాశపరిచాడు. మార్క్రమ్ 4వ ఓవర్లో బౌండరీతో పరుగుల వేట మొదలుపెట్టిన సంజూ.. మహారాజ్ 3వ ఓవర్లో 4, 6తో అతడికి స్వాగతం పలికాడు. క్రీజులోకి రావడంతోనే ఫోర్, సిక్సర్ బాదిన సూర్యకుమార్ యాదవ్ (17 బంతుల్లో 21, 2 ఫోర్లు, 1 సిక్స్) అండతో సంజూ మరింత రెచ్చిపోయాడు. జాన్సెన్ 5వ ఓవర్లో 4,6,4 బాదడంతో తొలి పవర్ ప్లే ముగిసేసరికి భారత్ స్కోరు 56/1 చేరింది.

# సినిమా వార్తలు MOVIE NEWS

# అందుకే అలాంటి పాత్రలకు దూరంగా ఉంటా : సమంత

**మహా, సినిమా:** టాలీవుడ్ స్టార్ నటి సమంత తాజాగా హిందీ వెబ్‌సిరీస్ 'సిటాడెల్: హనీ బన్నీ'తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. ఈ సిరీస్ ఈ నెల 7 నుంచి అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. ప్రస్తుతం సామ్.. ఈ సిరీస్ ప్రొమోషన్స్‌లో పాల్గొంటోంది. ఈ నేపథ్యంలో తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న సమంత.. సినిమాల్లో మహిళల పాత్ర గురించి మాట్లాడారు. మహిళా పాత్రలకు తక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని, మహిళలకు గుర్తింపు వచ్చేలా చేయడం నటిగా తన బాధ్యత అని అన్నారు. ఆడియన్స్‌ను తక్కువ అంచనా వేయకూడదని.. వారు అన్ని విషయాలను గమనిస్తుంటారని సమంత అన్నారు. అందుకే ఏం చేసినా బాధ్యతగా చేయాల్సి ఉంటుందన్నారు. తాను ఓ విషయానికి ప్రాతినిధ్యం వహిస్తున్నప్పుడు.. దానికి సంబంధించి పూర్తి బాధ్యత తనపై ఉంటుందన్నారు. అందుకే సినిమాల్లో పాత్రను ఎంచుకునే సమయంలో ఆచితూచి అడుగు వేస్తానని తెలిపారు. ఎన్నో విషయాలు గురించి ఆలోచించి నిర్ణయం తీసుకుంటానని చెప్పారు. ప్రస్తుత సమాజంలో మహిళలకు న్యాయమైన ప్రాతినిధ్యం ఉండాలని తాను భావిస్తున్నట్లు చెప్పారు. అందుకే సినిమాల్లో రెండు, మూడు సన్నివేశాలకే పరిమితమయ్యే పాత్రలకు తాను దూరంగా ఉంటానని స్పష్టం చేశారు. యాడ్స్ విషయంలోనూ ఆలోచించి నిర్ణయం తీసుకుంటానని సామ్ చెప్పుకొచ్చారు. ఇక ఇదే కార్యక్రమంలో 'సిటాడెల్: హనీ బన్నీ'లో తన పాత్ర గురించి కూడా సామ్ మాట్లాడారు. ఈ సిరీస్‌లో నటించడం తనకు సవాల్‌గా అనిపించిందన్నారు.



# ప్రభాస్‌కు మాత్రమే సాధ్యం

దేశంలోనే అత్యంత డిమాండ్ ఉన్న సూపర్‌స్టార్లలో ఒకరిగా అవతరించారు ప్రభాస్. 'బాహుబలి' ఫ్రాంచైజీ నుంచి నిన్నమొన్నటి 'కల్కి 2898ఏడీ' వరకూ ఆయన నటించిన ప్రతి సినిమా, వందలకోట్ల వసూళ్లను రాబడుతూ ప్రభాస్ స్టామినాను తెలియజేస్తూనే ఉంది. దేశవ్యాప్తంగా విమర్శలను ఎదుర్కొన్న 'ఆదిపురుష్' సైతం దాదాపు 450కోట్ల వసూళ్లను రాబట్టిందంటే ప్రభాస్ స్టామినా ఏంటో అర్థం చేసుకోవచ్చు. ఆయన 'బాహుబలి 2' 1800కోట్ల వసూళ్లతో దేశంలోనే అత్యధిక వసూళ్లు సాధించిన సినిమాల్లో ఒకటిగా నిలిచింది. ఇప్పటికీ ఆ రికార్డును అందుకునే సినిమా రాలేదు. ప్రస్తుతం ఆయన జెట్ వేగంతో సినిమాలు చేస్తూ దూసుకుపోతున్నారు. మారుతి దర్శకత్వంలో 'రాజాసాబ్', హను రాఘపూడి దర్శకత్వంలో 'ఫౌజీ', మరోవైపు సందీప్‌రెడ్డి వంగా 'స్పిరిట్', ఇంకోవైపు ప్రశాంత్‌నీల్ 'సలార్ 2'. ఇక నాగ్ అశ్విన్ 'కల్కి 2' ఇలాగూ ఉంది. వీటిలో కొన్ని షూటింగ్ దశలో ఉంటే.. కొన్ని ప్రీప్రొడక్షన్ దశలో ఉన్నాయి. ఇదిలావుంటే.. ఈ వేగాన్ని మరింత ఉధృతం చేసే దిశగా ప్రభాస్ అడుగులేస్తున్నారు. కన్నడ సినీరంగంలో పేరెన్నికగన్న ప్రతిష్ఠాత్మక చిత్ర నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్. ఇప్పటికే వారు నిర్మిస్తున్న 'సలార్ 2'లో నటిస్తున్నారు ప్రభాస్. ఈ సినిమా తర్వాత 'హోంబలే' నుంచి వచ్చే మరో రెండు సినిమాల్లో ఆయన నటించేందుకు ఒప్పందం కుదిరింది. ఆ సినిమాలేంటి? దర్శకులెవరు? తదితర అంశాలపై త్వరలోనే క్లారిటీ రానుంది. అయిదు సినిమాలు ప్రస్తుతం నిర్మాణంలో ఉండగా, మరో రెండు సినిమాలకు ప్రభాస్ సైన్ చేయడం ఇప్పడు చర్చనీయాంశమైంది.



# రెండు షిఫ్ట్‌ల్లో బిజీ

**మహా, సినిమా:** ఒకప్పుడు అగ్ర కథానాయికలు రెండు, మూడు షిఫ్ట్‌ల్లో పనిచేసేవారు. తమ వల్ల సినిమా షెడ్యూల్స్‌కు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూసుకునేవారు. ఇప్పడు అలాంటి అంకితభావం ఉన్న నాయికలు చాలా అరుదనే చెప్పాలి. ప్రస్తుతం కన్నడ భామ రష్మిక మందన్న సైతం అదే తరహాలో రెండు షిఫ్ట్‌ల్లో పనిచేస్తూ బిజీగా ఉంది. ఆమె కథానాయికగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'పుష్ప-2' డిసెంబర్ 5న విడుదలకు సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. షూటింగ్ చివరి దశకు చేరుకోవడంతో రష్మిక మందన్న ఈ సినిమా విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నది. అదే సమయంలో ఆమె సల్మాన్‌ఖాన్ సరసన నటిస్తున్న 'సికందర్' సినిమా షూటింగ్ సైతం ప్రస్తుతం హైదరాబాద్‌లోనే జరుగుతున్నది. ఈ సినిమాల కోసం రెండు షిఫ్ట్‌ల్లో పనిచేస్తున్నదట రష్మిక మందన్న. 'పుష్ప' చిత్రంలో ఆమె పోషించిన శ్రీవల్లి పాత్రకు యువతరంలో మంచి క్రేజ్ దక్కింది. ఈ నేపథ్యంలో సీక్వెల్‌లో ది బెస్ట్ పర్‌ఫార్మెన్స్ ఇవ్వాలనే తపనతో పనిచేస్తున్నదట రష్మిక. వర్క్ విషయంలో ఆమె అంకితభావాన్ని చూసిన యూనిట్ సభ్యులు ఫిదా అవుతున్నారట. ప్రస్తుతం రష్మిక మందన్న తెలుగులో కుబేర, రెయిన్‌బో, ది గర్ల్‌ఫ్రెండ్ చిత్రాలతో బిజీగా ఉంది.

